ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 289 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | గురువారం 15 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## నెలాఖరులో పబ్లిక్ ఇష్యూకు యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్

**హైదరాబాద్ :** ప్రైమ్ ఫ్యూయల్ బ్రాండ్‌తో ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను విక్రయించే యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నట్టు తెలిపింది. జనవరి చివరి వారంలో ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రమోటర్ ఎంఎస్ బనాని వెల్లడించా రు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బనాని మాట్లాడుతూ..

## భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!

**దిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు




సంక్రాంతి పండుగ సందర్భంగా పత్రిక కార్యాలయానికి నేడు (గురువారం) సెలవు. కావున రేపు (శుక్రవారం) పత్రిక వెలువడదు.. తిరిగి పునర్దర్శనం శనివారం.

# గ్రామాల పరిపాలనపై శిక్షణ

- పంచాయతీరాజ్ చట్టంపై శిక్షణకు అధికారుల ఏర్పాట్లు
- ఈ నెల 19 నుంచి 5 విడతలుగా ప్రారంభం కానున్న శిక్షణ
- పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం
- వంద మందికి ఒక బ్యాచ్ చొప్పున విభజించి శిక్షణ
- గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు తదితర 24 అంశాలకు సంబంధించి అవగాహన
- జిల్లాకు 8 మంది చొప్పున రీసోర్స్ పర్సన్‌లను అధికారులు ఎంపిక




**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన పాలక వర్గాలకు పల్లె పాలనతో పాటు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 19 నుంచి సర్పంచులకు శిక్షణ ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో సర్పంచులకు ఈ నెల 19 నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో 5 రోజుల పాటు గ్రామాల పరిపాలనపై శిక్షణ ఇవ్వనున్నారు. అందరికీ ఒకేసారి కాకుండా వంద మందికి ఒక బ్యాచ్ చొప్పున విభజించి ఐదు విడతలుగా అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 12,702 మంది సర్పంచిలతో పాటు ఉపసర్పంచిలు వార్డు మెంబర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందుకోసం కరదీపికలను సిద్ధం చేశారు. ఒక్కో బ్యాచ్‌లో 50 మందికి ఒకటి చొప్పున రెండు తరగతులుగా ట్రైనింగ్ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, ఎంపీవోలతో పాటు రిటైర్డ్ ఎంపీడీవోలను రిసోర్సు పర్సన్లుగా ఎంపిక చేశారు. వారికి హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థ(ఐఆర్‌డీ)లో ఈ నెల 5 నుంచి 10 వరకు శిక్షణకు సంబంధించిన వివరాలపై తర్ఫీదునిచ్చారు. దానికి హాజరైన వారంతా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. సర్పంచుల శిక్షణ పూర్తయిన తర్వాత ఉప సర్పంచులు, వార్డు - మిగతా3లో

## మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ..



- ఈడీకి వ్యతిరేక పిటిషన్ కొట్టివేత..
- ఇటీవలే ఐ-ప్యాక్ సంస్థపై ఈడీ జరిపిన దాడుల్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారు
- మమత బెనర్జీ కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లి, నేరానికి పాల్పడ్డారని ఆరోపించింది

# 'బర్ప్ సూట్' మోడ్రన్ సాఫ్ట్‌వేర్‌తో అక్రమాలు

- భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల దారి మళ్లింపు వ్యవహారం
- ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో చలానాల చెల్లింపు ప్రక్రియలోకి చొరబాటు
- సాగు భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల దారిమళ్లింపు వ్యవహారంలో వెలుగులోకి
- కొట్టేసిన సొమ్ముతో నిందితుడు బస్వరాజ్ విలాసాలు




**హైదరాబాద్**

సాగు భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి జనగామ కేంద్రంగా జరిగిన ఛార్జీల దారి మళ్లింపు వ్యవహారంలో అక్రమార్కులు 'బర్ప్ సూట్' అనే ఆధునిక సాఫ్ట్‌వేర్ వాడినట్లు వెలుగులోకి వచ్చింది. చలానాల చెల్లింపు ప్రక్రియలోకి చొరబడ్డ నిందితులు, ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి అక్రమాలకు పాల్పడి ఉంటారని, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల చాలాకాలంగా ఇది జరుగుతోందని అధికారులు అనుమానిస్తున్నారు. జనగామలోని ప్రైవేటు ఆన్‌లైన్ కేంద్రం ద్వారా జరిగిన ఒక లావాదేవీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఉదంతం బయటకు రావడంతో రెవెన్యూ అధికారులు జరిపిన ప్రాథమిక విచారణలో మొత్తం 4,800 లావాదేవీల ద్వారా ప్రభుత్వ ఖాజానాకు రూ.52 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తేలింది. రంగారెడ్డి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఇలాంటి - మిగతా3లో



## ఇది రేవంత్ సర్కార్ రాజకీయ వికృత క్రీడ

- పండగ పూట జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు
- ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడం అక్రమం
- "మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా?
- ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా?




## తక్షణమే ఇరాన్‌ను వీడండి

- భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు
- ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- కీలక ఆదేశాలు జారీ చేసిన భారత రాయబార కార్యాలయం
- అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచన



## 40 ఏళ్లుగా ఉగ్రవాదంపై కెనడాకు చెబుతున్నాం.. కానీ!

- భారత రాయబారి విమర్శలు
- ఉగ్రవాదాన్ని అరికట్టడంలో 40 ఏళ్లుగా విఫలమవుతున్నారని ఆగ్రహం
- భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని ఆరోపణ
- భారత్‌ను ఆధారాలు అడుగుతున్న కెనడా, తాను మాత్రం ఆధారాలు చూపించడం లేదని విమర్శ





## శబరిమలలో కనులపండువగా మకరజ్యోతి దర్శనం

- అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన శబరిగిరి కొండలు
- పొన్నాంబలమేడుపై మూడుసార్లు కనిపించిన దివ్యజ్యోతి
- తిరువాభరణాల అలంకరణ తర్వాత జరిగిన ప్రత్యేక పూజలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో నిండిపోయిన సన్నిధానం

## సంపాదకీయం

# సహజ సంపద కార్పొరేట్ల కోసమేనా?

"భూమిపై ఉన్న వనరులను ఎంత కొల్లగొట్టి వినియోగిస్తే అంత ఆర్థిక ప్రగతి అనే ప్రచారం భారీ ఎత్తున చేయడం, వాటి గురించి స్థానిక దినపత్రికల్లో గంభీరమైన మాటలు మాట్లాడటరౌ సమావేశాల్లో ప్రభుత్వ కమిటీల ముందు భారీ ప్రజంటేషన్లు, ఆర్థిక నివేదికలూ ప్రదర్శించడం ద్వారా సహజ వనరులను దోచుకునే మార్గాన్ని సుగమం చేసుకోవడం మా పని, ఒకవేళ మా పనిలో విఫలమైతే మా బాధ్యతను తోడేళ్లు అని పిలవడబడే మరొక ఏజెంట్లు తీసుకుంటారు అంటూ ప్రపంచబ్యాంకు నియమిత ఆర్థికవేత్త జాన్ పెర్కిన్స్ ఒక దళారీ పశ్చాత్తాపంలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సహజవనరులను పరిశ్రమల పేరుతో ఎలా కొల్లగొడతారో క్షుణ్ణంగా వివరించారు. 2006లో తెలుగులో ముద్రితమైన ఈ పుస్తకంలో అప్పటి అమెరికా కంపెనీ తరుపున తోడేలుగా పనిచేసి పశ్చాత్తాపంతో జాన్ పెర్కిన్స్..ఇలా బయటపెట్టారు. వరల్డ్‌బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు చేస్తున్న దురాక్రమణల్లో ఎపి కూరుకుపోయిందా ? అంటే అవుననే అనుమానం కలుగక మానదు. ఈ సంస్థల కుట్రల్లో ఎపి అత్యంత వేగంగా భాగస్వామి అవుతోంది. పెట్టుబడుల పేరుతో విలువైన సహజ వనరులను దోచుకోవడం, ఆహార పంటలు పండే భూములను అభివృద్ధి, పట్టణీకరణ పేరుతో ప్రభుత్వాలు లాక్కోవడం భూములను నానశం చేయడం, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం వంటివి చకచకా జరిగిపోతున్నాయి. వాటికి అభివృద్ధి, ఉపాధి అనే ట్యాగ్ లైన్లు తగిలించి ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా చేసుకుపోతున్నాయి. ఇచ్ఛాపురం నుండి తడ వరకూ, చిత్తూరు నుండి బెంగుళూరు వరకూ ఒకసారి పరిశీలన చేస్తే ఈ విషయం స్పష్టంగా కనపడుతుంది. ఓడరేవులు, రహదారులు, ప్రాజెక్టులు, భారీ వ్యాపార సముదాయాలు, పర్యాటక ప్రాజెక్టులు, క్రీడా సముదాయాలు, విద్యుత్ తయారీ సంస్థలు ఇవన్నీ కూడా వారు చెప్పే అభివృద్ధిలో భాగంగా కనిపిస్తుంటాయి. కానీ ఉపాధి అనేది కనిపించదు. గ్యారంటీ లేని ఉపాధి పేరుతో పంటలు పండే, తిండిపెట్టే భూములను కొద్దిమందికి ఎందుకు కట్టబెడతారు అని ప్రశ్నిస్తే అటువంటి వారిపై కేసులు పెట్టి జైళ్లలో పెడతారు. అనకాపల్లి జిల్లాలో సిపిఎం నాయకులు అప్పలరాజుపై పిడి యాక్టు కూడా ప్రపంచబ్యాంకు నియమిత పిఎంసిలు చేసిన సూచన మేరకే జరిగిందనేది వాస్తవం. విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి పేరుతో ఉన్న స్టీలు ప్లాంటును నాశనం చేసి ప్రైవేటు స్టీలు ప్లాంటుకు భూములు అప్పగించారు. అదే మిట్టల్ స్టీల్. ఇదో మల్టీనేషనల్ కంపెనీ. దీనికి పోర్టు కేటాయించాలి, అదే ప్రాంతంలో ఫార్మాస్యూటికల్స్, అదానీ, అంబానీ వంటి కంపెనీలకూ భూములు కట్టబెడుతున్నారు. వాటిని ప్రశ్నించింది అప్పలరాజు. ప్రజలను సమీకరిస్తున్నారు. ఆయన రైతు సంఘం నాయకులు కూడా. అప్పలరాజు అటు జైల్లోకి వెళ్లడం ఇటు నక్కపల్లి వద్ద పోర్టుకు భూములు కేటాయించడం, క్యాబినెట్ ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. పరిశ్రమల పేరుతో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో భూములను భారీగా లాగేసుకుంటున్నారు. ఇప్పుడు అన్నపూర్ణగా పిలిచే కోనసీమ జిల్లాకూ దీన్ని విస్తరించారు. అంటే మరో పదేళ్లలో రాష్ట్రం ఆహార సంక్షోభం దిశగా నడిచే పరిస్థితి కనిపిస్తోంది. దీనివల్ల నష్టపోయేది చిక్కిపోయిన పేద ప్రజలే. దీన్ని ప్రశ్నించకుండా ఉండటం కోసం అక్కడ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీలు అంటే ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో పనిచేసేవి ఇచ్చే నివేదికల ఆధారంగా ప్రభుత్వాలు అత్యంత వేగంగా చర్యలు తీసుకుంటున్నాయి. అడ్డొచ్చినవారిని ఏదో ఒకరూపంలో తప్పించేయడం, కాదనుకుంటే ఎరవేయడం, దీనికోసం స్థానికంగా కార్పొరేట్ నిధులతో నడిచే మీడియా సంస్థల ద్వారా అభివృద్ధి అనే ప్రచారం పేరుతో ప్రజలను మభ్యపెట్టడం ఇవన్నీ క్రమ పద్ధతిలో జరిగిపోతుంటాయి. పరిశ్రమల పేరుతో భూములు లాక్కోవడం ఒకెత్తయితే ఆహారం కోసం ప్రపంచబ్యాంకు నిర్దేశిత దేశాలపై ఆధారపడటం, దీనికోసం ఆర్థికంగా నష్టపోవాలంటే అక్కడ ఆయా దేశాల్లో ఆహార పంటలను దెబ్బతీయడం, సువిశాల సహజ వనరులను కొల్లగొట్టడం ఇవన్నీ వరుసక్రమంలో జరుగుతుంటాయి. ఇదే సమయంలో ప్రకృతి సేద్యం పేరుతో ప్రపంచబ్యాంకు ప్రోత్సాహక స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించడం, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని వారి అనుబంధ సంస్థలతో ఆరోగ్య పరమైన సలహాల పేరుతో క్లాసులు చెప్పించి ప్రజల ఆలోచనలు మార్చడం ఒవన్నీ కూడా ఒక పద్ధతి ప్రకారం జరిగిపోతుంటాయని జాన్ పెర్కిన్స్ తన రచనలో పేర్కొన్నారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కోనసీమ, దివిసీమ, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు ఇలా చూసుకుంటూ పోతే ప్రతిజిల్లాలోనూ ఒక్కో పంట ప్రత్యేకత కనిపిస్తుంది. సారవంతమైన నేలలూ ఉన్నాయి. ఎక్కడిదాకా ఎందుకు అమరావతి నిర్మిస్తున్న ప్రాంతం సశ్యశ్యామలమైన ప్రాంతం, పక్కనే మెట్టభూములు ఉన్నాయి. వాటిని వదిలేసి పంటలు పంటే చోటే నగరాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారు. ఏమైంది ఆహార పంటలు లేకుండా పోయాయి. దానికి అనుకున్న ప్రాంతం మొత్తం రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిసి సాగుతగ్గిపోయింది. కరేడు అంతే పక్కనే పనికిరాని భూమి ఉంటే కరేడులోనే విద్యుత్ కేంద్రానికి భూములు కేటాయించారు. త్వరలో కోనసీమ జిల్లాకు ఇది పాకుతుంది. ఉత్తరాంధ్రలో జీడిమామిడి తోటలు. వరి, చిత్తూరులో మామిడి, కడప, కర్నూలు, అనంతపురంలో అరటి వేరుశనగ ఇలా చూసుకుంటూ పోతే పరిశ్రమలన్నీ పంటలు పడే చోటే పెడుతున్నారు. నిజంగా పంటలు పంటని భూములు చాలా ఉన్నాయి. అంటే ఒక పద్ధతి ప్రకారం రాష్ట్రంలో సహజవనరులు ఒకరిద్దరి చేతుల్లోకి పోతున్నాయి. విద్యుత్ ప్రాజెక్టులు, పోర్టులు, రహదారుల పేరుతో పంటలు పండే భూములన్నీ నాశనం అవుతున్నాయి. ఆర్థికంగా ఇబ్బందులూ పెరుగుతున్నాయి. మరి రాష్ట్రంలో ప్రజలు ఎలా బతకాలి అనేది

# ఆంధ్రా భీష్మాచార్యులు

చికాగో సర్వధర్మ సమ్మేళనంలో పాల్గొని, భారతదేశానికి తిరిగి వచ్చిన స్వామి వివేకానంద యోగి పుంగవుడు మద్రాసు రేవులో కాలిడగానే ఆయనను పూల మాలాలంకృతుల గావించి సాదరంగా ఆహ్వానించే అవకాశాన్ని పొందిన వ్యక్తి న్యాపతి సుబ్బారావు. అంతేకాదు... వివేకానందుని ఆహ్వాన సభకు అధ్యక్షత వహించిన అరుదైన గౌరవం దక్కించుకున్న అదృష్టవంతులు ఆయనే. భారతదేశములో ఒక విశిష్ట స్థానం కలిగి, దక్షిణ భారత దేశములో ఎక్కువ ప్రచురణ కలిగిన పత్రికగా, ప్రాచుర్యంలో ఉన్న ది హిందూ ఆంగ్ల దినపత్రికకు పత్రికను స్థాపించి ఇప్పటికి సుమారు 120 సంవత్సరాలు దాటింది. ఈ పత్రిక ఎలా ప్రారంభించ బడింది అంటే...తిరువయ్యారుకు చెందిన 23 ఏళ్ళ జి. సుబ్రమణియ అయ్యర్, ఆయన స్నేహితుడు, పచ్చయ్యప్ప కళాశాలలో ఆయన సహోద్యోగి, చెంగల్పట్టుకు చెందిన 21 ఏళ్ళ ఎం. వీరరాఘవా చారియర్ - నలుగురు న్యాయ శాస్త్ర విద్యార్థులు టి.టి. రంగాచారియర్, పి.వి. రంగా చారియర్, డి.కేశవ రావు పంత్, న్యాపతి సుబ్బారావు పంతులు (హిందూ స్థాపకుల్లో ఆంధ్రుడు) - వీళ్ళందరూ ట్రిప్లికేన్ సాహితీ సంఘం సభ్యులు. ఈ సంఘం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ వైఖరుల గురించి ప్రజలకు అవగాహన కలిగించడం, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడం లక్ష్యాలుగా ఏర్పడింది. ట్రిప్లికేన్ సిక్స్ అని పేరుబడ్డ ఆ ఆరుగురు యువకులు మొదట న్యూస్‌పేపర్ అనే సైక్లోస్టైల్ పక్షపత్రికను ప్రారంభించారు. చెన్నైలో ఆ పత్రికకు మంచి స్పందన లభించడంతో హిందూను వారపత్రికగా ప్రచురించడం మొదలు పెట్టారు. ది హిందూ పత్రిక స్థాపన సెప్టెంబర్ 20, 1878న జరిగినట్లు పేర్కొంటారు. అలా ది హిందూ ఆంగ్ల పత్రిక స్థాపనలో ఒక తెలుగు వారు ఉండడం విశేషం. ఏ ఐ సీ సీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు పని చేశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆంధ్ర భీష్మ బిరుదాంకితులు, ప్రసిద్ధి స్వాతంత్ర్య సమర యోధుడు, సంస్కరణవాది, సాహిత్యవేత్త, పాత్రికేయుడు, న్యాపతి సుబ్బారావు పంతులు (1856, జనవరి 14 - 1941, జనవరి 15) మకర సంక్రాంతి రోజున నెల్లూరులో రాఘవరావు, రంగమ్మ దంపతులకు జన్మించారు. ఆ తరువాత కుటుంబం రాజ మండ్రికి మారింది. బాల్యం నుండే సుబ్బరావు విషయ పరిజ్ఞాన సముపార్జన పట్ల అమిత జిజ్ఞాస కలిగి ఉండి పేదరికం కారణంగా వీధిలాంతర్ల మసక వెలుతులో చదువు కొనసాగించారు. మెట్రిక్యు లేషన్ పాస్ అయ్యి అనంతరం మద్రాసు క్రైస్తవ కళాశాలలో చేరి స్కాలర్‌షిప్ సహాయంతో చదువుకుని 1876లో బిఎ డిగ్రీ పొందాడు. అనంతరం అధ్యాప కునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. బోధనా వృత్తిలో కొనసాగుతూనే న్యాయవాద విద్యను అభ్యసించి 1879లో లా పట్టాను పొందాడు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ న్యాయవాద పట్టాను పొందటం అప్పట్లో అరుదైన విషయం. ఈ ఖ్యాతిని సాధించిన దక్షిణ భారత దేశం లోని అతి కొద్దిమందిలో ఒకరిగా కోస్తా జిల్లాల్లో తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. న్యాయ విద్యార్థిగా ఉండగానే 22 ఏళ్ళ ప్రాయంలో ఆయన ట్రిప్లికేన్ సిక్స్‌గా పిలువబడే నాటి సాహిత్య సంఘం సభ్యులు మరో ఐదుగురు సభ్యుల మిత్ర బృందంతో కలసి, జాతీయో ద్యమానికి సహకరించే ఉదాత్త లక్ష్యంతో, ది హిందూ జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించారు. అప్పట్లో భారత దేశంలో ప్రచురిత మయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటీష్ ప్రభుత్వం కనుసన్నలలోనే ఉండేవి. ఉమ్మడి మద్రాసు రాష్టంలో సుబ్బా రావు గౌరవ న్యాయమూర్తి గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. 1880లో న్యాపతి సుబ్బారావు మద్రాసు నుంచి రాజమండ్రి తిరిగివచ్చి అక్కడే స్థిరపడ్డారు. మరో 9 మంది న్యాయ వాదులతో కలిసి రాజమండ్రి బార్ అసోషి యేషన్ స్థాపించారు. రాజమండ్రిలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంతో సన్నిహితంగా మెలగేవారు. వితంతు పునర్వి వాహాలు జరిపించడంలో వీరేశలింగానికి సుబ్బారావు పంతులు ఎంతగానో సహక రించారు. 1881లో స్థాపితమైన హితకారిణి సమాజం యొక్క మొదటి కార్యదర్శిగా నియమించ బడి నిర్వహణలో, కార్యకలాపాల విస్తరణలో విలువైన సేవలందించారు. 1885లో రాజమండ్రి పురపాలక సంఘానికి తొలి అనధికార ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1888 వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే రాజమండ్రి ప్రజలకు తొలిసారి నళ్ళాల కనెక్షన్లు మంజూరు చేశారు. 1893లో ఆయన మద్రాసు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు సభ్యునిగా ఎన్నికై సర్కారు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ పదవిలో ఆయన వరుసగా మూడు పర్యాయాలు ఎన్నికై 1899 వరకు కొనసాగారు. 1896లో ఆయన రాజమండ్రి లోని టౌన్ హాల్ ట్రస్టుబోర్డు కమిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కలకత్తాలోని టౌన్ హాలు తర్వాత దేశంలో అంతటి ప్రాముఖ్యత రాజమండ్రి టౌన్ హాల్‌కు ఉంది. దీనిని కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించటం వెనుక న్యాపతి వారి సహకారం ఎంతో ఉంది. సుబ్బారావు పంతులు రాజమండ్రి ఎలక్ట్రిక్ సప్లై కార్పొరేషన్‌ను స్థాపించి, విద్యుదు త్పాదన చేయడమే కాక తొలిసారిగా రాజమండ్రికి ఆ విద్యుత్ ను సరఫరా చేసి వెలుగులు నింపాడు. 1893లో ఆయన రాజమండ్రిలో చింతామణి పత్రికను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటు లోకి తెచ్చారు. ఈ పత్రికకు కందుకూరి వీరేశలింగం పంతులు ఎడిటర్‌గా వ్యవహ రించారు. రచయితల్ని ఆర్థికంగా ప్రోత్సహించటం లక్ష్యంగా సుబ్బా రావు పంతులు నవలారచన అంశంగా వివిధ పోటీలు నిర్వహించే వారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం రచనా వ్యాసంగానికి సుబ్బారావు నైతికంగా, ఆర్థికంగా ఎంతో సహకరించారు. అదేవిధంగా హరికథ పితామహ ఆదిభట్ల నారాయణ దాసును రాజమండ్రి, పరిసర ప్రాంతాలకు పరిచయం చేసినది కూడా ఆయనే. 1922 ప్రాంతంలో రాజమండ్రిలో ఆంధ్ర చారిత్రక పరిశోధనా సంస్థ (ఇప్పుడు రాళ్ళబండి సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలగా ఉన్నది) ఏర్పాటును న్యాపతి సుబ్బారావు పంతులు ఎంతగానో ప్రోత్సహించారు. 1897, ఫిబ్రవరి11న స్వామి వివేకానంద అంతర్జాతీయ మతాల సమావేశంలో ప్రసంగించి భారత దేశం తిరిగివస్తున్న సందర్భంలో ట్రిప్లికేన్ సిక్స్ మిత్రబృందం ఆయన్ను ఆహ్వానించ డానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున పురజనులు హాజరైన ఆ సమావేశంలో వివేకానందుని ఆహ్వాన సంఘానికి న్యాపతి సుబ్బారావును అధ్యక్షునిగా నియమించారు. వివేకానందుడు మద్రాసు రేవులో దిగగానే పూలమాల వేసి ఆహ్వానించిన తొలి వ్యక్తి సుబ్బారావే. ఆ మరు సటి రోజు విక్టోరియా హాల్లో వివేకానందునికి ఆహ్వాన సభ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి14న మెరీనా బీచ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వివేకానం దునితో పాటు సుబ్బారావు పంతులు వేదికను అలంకరిం చారు. అలా ప్రారంభమైన వీరి స్నేహం సుబ్బా రావుపై గాఢమైన ప్రభావాన్ని వేసింది. 1903లో వివేకానందుని స్ఫూర్తితో, సుబ్బారావు రాజమండ్రి లో భగవద్గీత, సనాతన హిందూధర్మ ప్రచారానికై, హిందూ సమాజం అనే సంస్థను స్థాపించారు. 1898 నుంచి 1917 వరకూ భారత జాతీయ కాంగ్రెస్‌లో ఆయన కీలకమైన భూమికను పోషించారు. 1907లో వందేమాతర ఉద్యమ సందర్భంగా బిపిన్ చంద్రపాల్‌ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించారు. విజయ వాడలో 1914 ఏప్రిల్ 11వ తేదీన జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు ఆయన అధ్యక్షత వహిస్తూ, మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్ర విభజన కోసం చారిత్రాత్మకమైన పిలుపు నిచ్చారు. 1918 జనవరి 1వ తేదీన సుబ్బారావు పంతులు డిమాండ్ మేరకు ఆంధ్రప్రాంతానికి ప్రత్యేక ప్రాంతీయ కాంగ్రెస్ కౌన్సిల్‌ను అధిష్టానం ఏర్పాటు చేసింది. ఈ మండలికి న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షుడ య్యారు. అంతేగాక ఆయన అఖిలభారత కాంగ్రెసు కమిటీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు ఎన్నికై సేవలందిం చారు. సుబ్బారావు పంతులు 1941, జనవరి 15వ తేదీన మరణించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి తాతా రమేశ్ బాబు

ఆయన ప్రజ్ఞ అసామాన్యం. కృషి అనితర సాధ్యం. తెలుగు రచయితగా, తెలుగు సినిమా ఆర్ట్ డైరక్టరుగా, సంపాదకుడుగా, చిత్రలేఖనోపాధ్యాయుడుగా ఏ పని చేసినా అంకిత భావంతో, చిత్తశుద్ధితో, లక్ష్యంతో చేసేవారు. పగటి వేషాలు వేసినా, చిత్రాలను గీసినా, గేయాలు రాసినా, సంపాద కత్వం వహించినా, ప్రసంగాలు చేసినా, విద్యార్థులకు శిక్షణలు ఇచ్చినా, వారిలో సృజనాత్మకత పెంపొందించే కృషి సల్పినా పనిలో లీనమై చేసేవారు. తాతా రమేశ్ బాబు(1960 జనవరి 15 - 2017 ఏప్రిల్ 20) గుంటూరు జిల్లా భట్టిప్రోలు గ్రామంలో 1960 జనవరి 15 వ తేదీన బసవలింగం, బోలెం లక్ష్మీనరసమ్మ దంపతులకు జన్మించారు. ఆయన బాల్యం అంతా కృష్ణా జిల్లా లోనే గడచింది. ఉయ్యూరు, కైకలూరు, మొవ్వ, అవనిగడ్డ లలో తొమ్మిదవ తరగతి వరకూ చదువు కున్నారు. పదవ తరగతి మచిలీపట్టణం జైహింద్ హైస్కూల్ లోనూ, ఇంటర్మీడియట్, డిగ్రీలను ఆంధ్ర జాతీయ కళాశాల లోనూ చదువుకున్నారు. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో వుండగా మద్రాసు సినీ పరిశ్రమకు అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా వెళ్ళవలసి వచ్చింది. అందువల్ల డిగ్రీ పూర్తి చేయలేక పోయారు. ఆయనకు చిన్ననాటి నుండి లలిత కళలు అన్నా, ఆటలు అన్నా చాలా ఇష్టం. అయిదారు తరగతుల్లో ఉన్నప్పు డు ఆయన ఈ బాలగేయం రాశారు. ఆ సమయంలోనే "బాల జ్యోతి"లో ఆయన గేయాలు కొన్ని అచ్చయ్యాయి. ఆ వయసులోనే బొమ్మలంటే చాలా ఇష్టం కలిగింది. వేద్దామంటే ఇంట్లో కుంచెల్లాంటివి ఏమీ ఉండేవి కావు. ఓ కర్రతో బొమ్మలు గీసేవారు. అలా చిత్రకళపై పట్టు పెంచుకున్నా ఇప్పటి వరకూ ఆధునిక పద చిత్రాలు, సూక్ష్మచిత్రాలు, 'అభినందన సందేశాల చిత్రాలు... అన్నీ కలిపి లక్షల్లో గీశారు. ఆయన పదవ తరగతి నుంచే గేయాలు రాయటం, నాటకాలు వేయటం మొదలు పెట్టారు. ఆయన రచనలు చాలా దిన, వార పత్రికలలో ప్రచురించ బడేవి. ప్రచురింపబడిన ఆయన పుస్తకాలు, అణువు పగిలింది (కవిత్వం), పిడికిలి (దీర్ఘ కవిత), తాతా రమేశ్ బాబు కథలు, విప్లవ రుతువు (కవిత్వం), తొలిగీతలు, దిద్దు బాటు (బొమ్మలాట), తయారు చేద్దాం (క్రాఫ్ట్ వర్క్), అసలు నిజాం (బొమ్మలాట), నాన్నో పులి (బొమ్మలాట), బొమ్మలాట (బొమ్మలు తయారు చేసి ఆడించటం), శుభాకాంక్షలు (అభినందన పత్రాలు), లయ (ఆకాశవాణి సమీక్షలు), నా దేశం (దీర్ఘ కవిత), తాతా రమేశ్ బాబు చిత్రకళ, బాలబంధు బివి జీవిత చరిత్ర. 2005వ సంవత్సరంలో మచిలీ పట్టణం నుండి వెలువడిన 'జనప్రభ' సాహిత్యమాస పత్రికకు ఆయన సంపాదకుడిగా వ్యవహ రించారు. 2006వ సంవత్సరంలో జాతీయ తెలుగు రచయితల మహాసభలకు ముఖ్య కార్యకర్తగా సేవలను అందించటమే కాక, ఆంధ్ర ప్రదేశ్ అవతరణ స్వర్ణోత్సవాల నేపథ్యంలో యాభై ఏళ్ళ తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వికాసాల సమీక్షగా వెలువడిన నూట పన్నెండు వ్యాసాల సంకల నం 'తెలుగు పసిడి' గ్రంథనికి ఉప సంపాదకునిగా ఉన్నారు. అలాగే 2007 సంవత్సరంలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ముఖ్య కార్యకర్తగా సేవలను అందించారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల నేపథ్యంలో వివిధ రంగాలలో తెలుగువారి అరవై ఏళ్ళ ప్రగతి సమీక్షగా వెలువడిన 213 వ్యాసాల సంకలనం 'వజ్ర భారతి ' ఉద్గ్రంధానికి సంపాదక వర్గంలో ఉన్నారు. చిన్నప్పటి నుంచే ఆయనకు నాటకాలంటే ఇష్టం. నటన మీద ఇష్టంతో టీవీ ధారావాహికలు, చలనచిత్రాల్లో నటిస్తున్నా ఆయనకు నాటకాలతో అనుబంధం వల్లే జానపద కళల మీద ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా 'పగటి వేషాలు' అంటే చాలా ఇష్టం. పగటి వేషమంటే పగలు ధరించే మారురూపం. అర్జునుడు బృహన్నలగా, వేంకటేశ్వరుడు ఎరుకల సానిగా మారురూపాలు ధరించి ప్రశంసా పాత్రులు అయినారు. చదువురాని 'గొల్లబోయ'. 'వితంతువు' తదితర వేషాలు సామాజిక చైతన్యాన్ని రగిల్చాయి. ఆయన రంగస్థలం మీద "ఫలించని వంచన" నాటికలో కథనాయికగా, "ఏక్ దిన్ కా సుల్తానులో మీసాల వెంకటరత్నంగా "మనుష లొస్తున్నారు జాగ్రత్త"లో రెడ్డి గా, "క్రాంతి"లో రామారావుగా, "ది ఇన్సిడెంటులో బ్రాహ్మణుడుగా, "తాకట్టు"లో జ్ఞానేశ్‌గా, "కీర్తిశేషులు" నాటకంలో మురారిగా, ఆకాశవాణి, విజయవాడ కేంద్రంలో "రాంబాబు కాపరం"లో రాంబాబుగా, జాతీయ నాటకం నాదయోగిలో రామ రాయుడిగా , "అపూర్వ నరకం"లో తమిళ అయ్యరుగా, హైదరాబాద్ దూరదర్శన్‌లో "మొదటికే మోసం" బొమ్మలాటలో పప్పెట్‌గా, "సంసారం సాగరం" మెగా సీరియల్‌లో మంత్రగాడుగా, మినీ మూవీలో గంగిరెడ్డిగా, లయ సీరియల్‌లో వెంకటరావుగా, అబ్బాయి ప్రేమలో పడ్డాడు చలన చిత్రంలో గుండు అనుచరుడుగా నటించారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి తొలి రంగుల సినిమా బొమ్మలాటనూ వివిధ భారతిలో ఇవ్వటం, పగటి వేషాలు, సామాజిక ప్రయోజనం అనే అంశం మీద మూడు వారాల ధారావాహిక ప్రసంగాలు, గుడివాడ నాటక రంగం మీద మూడు వారాల ప్రసంగాలు ఇచ్చారు. గుడివాడ పురపాలక సంఘ అడుసుమిల్లి ఉన్నత పాఠశాలలో చిత్రకళ ఉపాధ్యాయునిగా 1985 నుండి పనిచేసి, సాంకేతిక విద్యలు నేర్పిస్తూ విద్యార్థులను ఉత్సాహ పరుస్తూ నూతన దృక్పథన్ని ప్రేరేపించారు. ఇందుకు ఆయన తన సొంత డబ్బును సమకూర్చి, స్క్రీన్ ప్రింటింగ్, ఫోటో లామినేషన్, పెయింటింగ్స్, పప్పెటరీ విద్యను బోధిస్తూ, ఒక కొత్త పద్ధతిలో బొమ్మలు వేయడం ద్వారా పిల్లలకు డబ్బు సంపాదించే మార్గాన్ని నేర్పించారు. పిల్లలతో బొమ్మలను తయారు చేసి, పప్పెట్ షోలను ఇప్పించడం స్వీయధనంతో తాతా రమేష్ బాబు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ సంస్థ ఆర్థిక సమతా మండలి, శ్రీకాకుళంలో .కొన్ని వందల మంది బాలబాలికలకు, అంగన్వాడి కార్యకర్తలకు, నమూనాలు తయారు చేయటం, స్క్రీన్ ప్రింటింగ్, మొదలయిన అనేక కళలలో సృజనాత్మక శిక్షణ ఇచ్చారు. అయిదు లక్షలకు పైగా అభినందన పత్రాలు, సూక్ష్మ చిత్రాలు, నీటి తైల వర్ణ చిత్రాలు చిత్రించారు. తాతా రమేశ్ బాబు వివిధ సీరియళ్లలో నటించారు. ఆడది, సంసారం-సాగరం, లయ, ఎదురీత, గంగతో రాంబాలు, అడవిపూలు, శ్రావణ సమీరాలు, మూగ మనసులు, అమ్మనా కోడలా, ప్రియమైన శత్రువు, అగ్నిపూలు, ఆకాశమంత, జాబిలమ్మ, రాములమ్మ, పాపం పద్మనాభం, ఇద్దరు అమ్మాయిలు, రాణివాసం, మనసు-మమత, అలక నంద, ఇది ఒక ప్రేమకథ, రియల్ డిటెక్టివ్స్, తాళికట్టు శు భవేళ, ఆడువారి మాటలకు అర్థాలు వేరులే తదితరాలలతో నటించారు.

# అభేద్యం మన ఇండియన్ ఆర్మీ

అత్యంత ధైర్యసాహసాలకు, అలుపెరుగని పోరాట పటిమకు, సాహసోపేత త్యాగమయ జీవితాలకు, ఉరకలెత్తే దేశభక్తి ఉత్సాహానికి, భరతమాత రక్షణకు కంకణం కట్టుకొని ప్రాణత్యాగం చేయడానికి నిలువెత్తు చిరునామా మన ఇండియన్ ఆర్మీ శక్తివంతమైన బలగాలు. 1895లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఏర్పాటు చేసిన "బ్రిటీష్ ఈస్ట్ ఇండియా భారత ఆర్మీ", తదుపరి వలస పాలన సమయంలో 'బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ' కొనసాగి, స్వాతంత్ర్యానంతరం "ఇండియన్ ఆర్మీ"గా రూపాంతరం చెందింది. దేశ రక్షణతో పాటు మానవీయ సంక్షోభ సమయాల్లో అంతర్గత శాంతి స్థాపనకు అమూల్య సేవలను అందిస్తున్న ఇండియన్ ఆర్మీ తొలి కమాండర్-ఇన్-చీఫ్ బాధ్యతలను ఫీల్డ్ మార్షల్ కె ఎం కరియప్ప 15 జనవరి 1949 శు భగడియల్లో నాటి బ్రిటీష్ జనరల్ ఫ్రాన్సిస్ బుచ్చర్ నుండి తీసుకోవడం జరిగింది. ఈ అపూర్వ శుభ సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 15 జనవరి రోజున మన త్రివిధ రక్షణ బలగాలు "ఇండియన్ ఆర్మీ దినోత్సవం" ఘనంగా నిర్వహించకపోవడం ఆనవాయితీగా మారింది. అభేద్యమైన మన ఇండియన్ ఆర్మీలో 49,932 మంది అధికారులతో కలిపి 12,37,127 మంది సైనిక సిబ్బంది, 9,60,000 మంది రిజర్వ్ సిబ్బంది నిరంతరం దేశ భద్రత, అంతర్గత శాంతి స్థాపన బాధ్యతలను పరమ పవిత్ర భావనలతో నిర్వహిస్తున్నది. "సేవ పరమో ధర్మః(సేవయే అత్యుత్తమ ధర్మం)" అనే నినాదంతో దేశానికి ముళ్ల కంచెలుగా నిలబడి దేశ భద్రతను కాపాడే బాధ్యతలను భుజాన వేసుకొని నిర్వహిస్తున్న ఇండియన్ ఆర్మీకి సుప్రీమ్ కమాండర్‌గా రాష్ట్రపతి, చీఫ్ ఆఫ్ ఆర్మీగా అత్యున్నత ఆర్మీ అధికారి నాయకత్వ బాధ్యతలను నిర్వహిస్తారు. దేశ భద్రతకు ముప్ప వచ్చిన ప్రతి సందర్భంగా యుద్ధభూమిలో ముందుండి శత్రు సైన్యానికి చెమట పట్టించగల ఇండియన్ ఆర్మీ ఇప్పటికే నాలుగు మేజర్ ఇండో-పాక్ యుద్ధాలు(1948, 1965, 1971, 1999), ఒక ఇండో-చైనా యుద్ధాలు(1962,1967)లో పాల్గొని తన సత్తాను చాటుకుంది. 15 జనవరి 2026న నిర్వహిస్తున్న 78వ ఇండియన్ ఆర్మీ దినోత్సవంలో దేశ భద్రత ఊపిరిగా సేవలందించి అమరత్వం పొందిన సైనికులకు నివాళులు అర్పించడం, వారి కుటుంబాలకు చేయూత ఇవ్వడం, అత్యుత్తమ ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీర జవాన్లకు అవార్డులు ప్రదానం చేయడం, ఆర్మీ పరెడ్స్ నిర్వహించడం, మన ఇండియన్ ఆర్మీ అమ్ములపొదిలో మన విజయానికి చేయూతనిస్తున్న అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలు/ఆయుధాలను ప్రదర్శించడం లాంటి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

ధర్మఘంట

# చేనేతకు కొత్త ఫ్యాషన్
# లేటెస్ట్ డిజైన్లపై కార్మికులకు ట్రైనింగ్

నేత వస్త్రాలు కొత్త సొబగులు అద్దుకుంటున్నాయి. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఆకట్టుకునే డిజైన్లతో తయారు చేస్తున్నారు. ఇందుకు నేత కార్మికులకు చేనేత శాఖ సహకారం అందిస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 35 చేనేత సమూహాలలో ఆధునిక డిజైన్లపై కార్మికులకు అవగాహన, ట్రైనింగ్ తరగతులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు తెలంగాణలోని కార్మికులు మగ్గాలపై సంప్రదాయ చీరలు, బెడ్‌షీట్లు, తివాచీలు, రుమాళ్లు, దుప్పట్లు, ఇతర రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటిని చేనేత సహకార సంఘానికి (టెస్కోకు) అమ్ముతున్నారు. మరోవైపు సంతల్లో, వస్త్రదుకాణాలకు ఈ దుస్తులను విక్రయిస్తున్నారు. సంప్రదాయ రకాలుగా గుర్తింపు ఉన్నా కొనుగోళ్లు సరిగా లేక తగిన నగదు రావడం లేదు. ఈ నేపథ్యంలో కార్మికుల స్థితిగతులపై గత ఏడాది ఆగస్టులో చేనేత, జౌళిశాఖ అధ్యయనం చేయించింది. ఈ సందర్భంగా మహిళలు నూతన డిజైన్లు, ఆకట్టుకునే రంగులు కావాలని అడుగుతు న్నారు. ఆధునికత ఉట్టిపడేలా ఉండాలని యువత చెప్పింది. దీంతో చేనేత శాఖ జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద తెలంగాణ రాష్ట్రంలో 35 నూతన సమూహాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఆధునిక ఫ్యాషన్, మార్కెట్ ట్రెండ్‌ను అందిపుచ్చుకుంటూ డిజైన్లను మార్చి చీరలతో పాటు బెడ్‌షీట్లు, డ్రెస్‌మెటీరియల్, లుంగీలు, తివాచీలు, రుమాళ్లు, కర్టెన్లు, టేబుల్ క్లాత్‌ల తయారీకి పూనుకుంది.

**టెస్కో దుకాణాలకు సరఫరా**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అయిన చేనేత సమూహాలలో ఆధునిక డిజైన్లపై చేనేత సంఘాల్లోని కార్మికులకు అవగాహన, నైపుణ్య అభివృద్ధి ట్రైనింగ్ క్లాస్‌లను గత ఏడాది అక్టోబరులో మొదలుపెట్టింది. అధునాతన మగ్గాలను ఆయా సమూహాల్లో ఏర్పాటు చేసింది. ఏ వయసు వారు ఎలాంటి వస్త్రాలు ఇష్టపడుతున్నారో వారికి నిపుణులు, డిజైనర్లు, జాతీయ చేనేత సాంకేతిక సంస్థ (ఐఐహెచ్‌టీ), పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్ల ద్వారా వివరణ ఇస్తోంది. డిజైన్ అభివృద్ధికి కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్‌ని వినియోగిస్తున్నారు. ట్రైనింగ్‌కు ప్రతి సమూహంలో రూ.30,000 వరకు వెచ్చిస్తోంది. దుస్తుల తయారీకి అవసరం అయిన నూలు, పట్టు, రంగులు, రసాయనాలను పంపిణీ చేస్తోంది. వీటి సహాయంతో కార్మికులు చీరలకు ఆధునిక హంగులు అద్దుతున్నారు. పోచంపల్లి, దుబ్బాక, గద్వాల, చేర్యాల, సిద్దిపేట, భువనగిరి, వరంగల్, సిరిసిల్ల, శాయంపేట తదితర చోట్ల కార్మికులు కొత్త డిజైన్లతో వస్త్రాలను తయారు చేస్తున్నారు. వీటిని వివిధ ఎగ్జిబిషన్లలో ప్రదర్శిస్తున్నారు. కొన్ని సమూహాల నుంచి టెస్కో దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. వాటిల్లో అమ్మకాలు ప్రారంభమయ్యాయి.



**సంఘాలను చైతన్యపరుస్తున్నాం**

చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఈ రంగాన్ని స్థిరంగా నిలబెట్టడానికి వైవిధ్యం చాలా అవసరమని నేత, జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. ఈ విషయంలో సంఘాలను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. సంప్రదాయ రకాలను నూతనంగా తీర్చిదిద్దడం ద్వారా వాటి పరిరక్షణతో పాటు వాడకం, ఆదరణ పెరుగుతోందని, పీతాంబరం వంటి రకాలకు చక్కని ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు.

"చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఈ రంగాన్ని స్థిరంగా నిలబెట్టడానికి వైవిధ్యం చాలా అవసరం. ఈ విషయంలో సంఘాలను చైతన్యపరుస్తున్నాం. సంప్రదాయ రకాలను నూతనంగా తీర్చిదిద్దడం ద్వారా వాటి పరిరక్షణతో పాటు వాడకం, ఆదరణ పెరుగుతోందని, పీతాంబరం వంటి రకాలకు చక్కని ఆదరణ లభిస్తోంది." – శైలజా రామయ్యర్, ముఖ్యకార్యదర్శి, చేనేత, జౌళిశాఖ

**కార్మికులకు మేలు చేస్తుంది**

వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న చేనేత కార్మికుల్లో క్రమేపీ మార్పు వస్తోందని కొత్తవాడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఎలుగం భద్రయ్య అన్నారు. నూతన పంథాలో వెళ్లడం ద్వారా వృత్తిని రక్షించడంతోపాటు జీవనోపాధి మెరుగవుతుందని నమ్ముతున్నామని తెలిపారు. ట్రైనింగ్ అనంతర కార్యాచరణకు చేనేత శాఖ సహకరించాలని, ఆయా వస్త్రాలను టెస్కో ద్వారానే కొనుగోలు చేయడం కార్మికులకు మేలు చేస్తుందని

# వ్యవస్థలు వైఫల్యం చెందిన వేళ..

గల్ఫ్ దేశంలో మృతి చెందిన ఓ కార్మికుడి మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అయ్యే ఖర్చును భరించలేమని కంపెనీ యాజమాన్యం, అలాగే ఇండియన్ ఎంబసీ కూడా చేతులెత్తేసిన పరిస్థితిలోఁడ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి ఆ వ్యయాన్ని పూర్తిగా భరించిన అరుదైన మానవీయ ఘటన చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా, నవీపేట మండలం యామ్చా గ్రామానికి చెందిన గొల్ల అబ్బులు (తొగరి అబ్బయ్య) అనే 40 ఏళ్ల కార్మికుడు, నాలుగు నెలల క్రితం ఓమాన్ దేశంలోని సలాలా ప్రాంతంలో ఒక క్లీనింగ్ కంపెనీలో పని చేయడానికి వెళ్లాడు. యాజమాన్యం వైఖరి నచ్చక కంపెనీ నుంచి బయటకు వెళ్లిన కొంతకాలానికే, డిసెంబర్ 14న ఇబ్రి ప్రాంతంలో మృతి చెందాడు. అనుమతి లేకుండా కంపెనీ నుంచి వెళ్లిన కార్మికులను అక్కడి చట్టాల ప్రకారం 'ఖల్లివెల్లి' (అక్రమ నివాసి)గా పరిగణించడంతో, వారికి లభించాల్సిన కొన్ని హక్కులు, సౌకర్యాలు రద్దవుతాయి.

ఈ నేపథ్యంలో, "అబ్బులు, కంపెనీ నుంచి వెళ్లిపోయాడు కాబట్టి అతనితో మాకు సంబంధం లేదు" అంటూ మృతదేహం తరలింపు ఖర్చును భరించబోమని కంపెనీ యాజమాన్యం స్పష్టం చేసింది. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ (ఐసీడబ్ల్యూఎఫ్) నుంచి సహాయం అందిస్తారు. అయితే నిధుల కొరత ఉందని పేర్కొంటూ, మృతదేహం తరలింపుకు రూ.1.50 లక్షలు చెల్లించాలని మస్కట్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారి ఒకరు కుటుంబానికి ఫోన్ చేసి తెలిపారు. ఆ మొత్తాన్ని చెల్లించలేని పరిస్థితిలో ఓమాన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంటుందని కూడా స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో మృతుడి భార్య తొగరి చిన్న సావిత్రి తన కుమారుడు సంజయ్, యామ్చా గ్రామ సర్పంచ్ బేగారి సాయిలుతో కలిసి మంగళవారం (13.01.2026) హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. తన భర్త పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అయ్యే ఖర్చును సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయాలని ఆమె వేడుకున్నారు. కాగా ఆమె ఇదివరకే డిసెంబర్ 29న మెయిల్ ద్వారా సీఎంఓ కు వినతిపత్రం పంపారు. దీనికి స్పందనగా జీఏడి ఎన్నారై విభాగం ఇండియన్ ఎంబసీకి వైర్ మెసేజ్ పంపింది. ఇదిలా ఉండగా, అబ్బులు చిన్నాపూర్ కు చెందిన ఒక గల్ఫ్ సబ్ ఏజెంట్ కు రూ.1.20 లక్షలు చెల్లించి ఓమాన్ కు వెళ్ళాడు. ఎమిగ్రేషన్ క్లియరెన్స్ మాత్రం అస్సాం రాజధాని




గౌహతి లోని ఒక రిజిస్టర్ రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జరిగింది. ప్రవాసీ భారతీయ బీమా యోజన (పిబిబివై) అనే రూ.10 లక్షల విలువైన ప్రమాదం బీమా పాలసీ కూడా జారీ అయింది. వలస కార్మికుడు విదేశాల్లో మరణించినప్పుడు మృతదేహాన్ని తరలించేందుకు అయ్యే ఖర్చును ప్రవాసీ పాలసీ ద్వారా పొందే అవకాశాన్ని మస్కట్ లోని ఇండియన్ ఎంబసీ ఎందుకు వినియోగించలేదన్నది పెద్ద ప్రశ్న. చట్ట ప్రకారం శవాన్ని తరలించే బాధ్యత రిక్రూటింగ్ ఏజెన్సీ తీసుకోవాలి. సమస్య 'మదద్' పోర్టల్ లో నమోదు అయిన తర్వాత కూడా ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ విషయం గురించి సరిగా పట్టించుకోలేదని స్పష్టం అవుతున్నది. తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, కమిటీ సభ్యుడు నంగి దేవేందర్ రెడ్డి, ప్రవాసీ ప్రజావాణి వాలంటీర్ మహమ్మద్ బషీర్ అహ్మద్ ఈ అంశాన్ని సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన డా. చిన్నారెడ్డి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రిని ఆదేశించారు.

**చలించిన ఐఏఎస్ అధికారిణి**

ఇదే అంశాన్ని సీఎం ప్రజావాణి నోడల్ అధికారి, ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్‌కు వివరించగా, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకొని వెంటనే స్పందించారు. ఓమాన్‌కు వెళ్లిన మూడు నెలలకే అబ్బులు మృతి చెందడం, నెలరోజులుగా ఆసుపత్రి శవాగారంలో మృతదేహం ఉండిపోవడం, భర్త పార్థివదేహం కోసం గ్రామం నుంచి హైదరాబాద్ వరకు వచ్చి మొరపెట్టుకున్న భార్య పరిస్థితి ఆమెను చలింపజేసింది. ఫలితంగా, ఓమాన్ నుంచి మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అవసరమైన రూ.1.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కొన్ని గంటల వ్యవధిలోనే చెక్కుగా జారీ చేసి మృతుడి భార్య చిన్న సావిత్రికి అందజేశారు. ఓమాన్‌లో ఇండియన్ ఎంబసీ గుర్తింపు పొందిన ఇండియన్ సోషల్ క్లబ్ తెలంగాణ విభాగం అధ్యక్షులు గుండేటి గణేష్ ఈ వ్యవహారంలో సమన్వయం చేస్తూ సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ మానవీయ సహాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ బోధన్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డిని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్ బెగారి సాయిలు, మంద భీంరెడ్డి తదితరులు ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన మానాల మోహన్ రెడ్డి, అనిల్ ఈరవత్రి, నాగేపూర్ మహిపాల్ రెడ్డికి వారు కృత్ఞతలు తెలిపారు.

## తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారు?: సీపీ సజ్జనార్

**హైదరాబాద్:** ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధులు దొంతు రమేష్, సుధీర్‌ల అరెస్టుపై సీపీ స్పందించారు. "మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలి. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారు? పిలిస్తే.. విచారణకు రావాలి కదా. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుంది. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి.సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోంది"అని సీపీ తెలిపారు.

## 'బర్ప్ సూట్' మోడ్రన్ సాఫ్ట్‌వేర్‌తో అక్రమాలు

-మొదటిపేజీ తరువాయి

లావాదేవీలు అత్యధికంగా జరిగినట్లు గుర్తించారు. ఈ అక్రమాలపై విచారణకు ప్రభుత్వం రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ తదితర విభాగాలకు చెందిన అధికారులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే స్లాట్లు బుక్ చేసిన ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. పోర్టల్‌లోని లోపాలను అడ్డం పెట్టుకొని నిందితులు అక్రమాలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

**బయటకు రాకుండా అధికారులకు మామూళ్లు!**

సాధారణంగా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఛార్జీలను రైతులు నగదు రూపంలో ఆన్‌లైన్ సేవా కేంద్రాల్లో చెల్లిస్తుంటారు. ఆన్‌లైన్ సేవా కేంద్రాల నిర్వాహకులు రోజంతా ఇలా జమ అయిన డబ్బును తమ అకౌంట్లో వేసుకుంటారు. తమ డెబిట్ కార్డు ఉపయోగించి తమ అకౌంట్లో ఉన్న డబ్బుతో లావాదేవీ పూర్తి చేస్తారు. ఇక్కడే వారు మతలబు చేస్తున్నారు. ఉదాహరణకు రిజిస్ట్రేషన్ ఛార్జీల కింద రూ.15 వేలు చెల్లించాల్సి ఉంటే, ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ సేవాకేంద్రం నిర్వాహకుడికి రైతు ఇస్తాడు. నిర్వాహకుడు మాత్రం అందులో రూ.150 మాత్రమే బ్యాంకుకు చెల్లిస్తాడు. కానీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ప్రభుత్వ ఖజానాలో రూ.15,000 జమ అయినట్లు చూపిస్తాడు. ఇలా చేసి రూ.14,850 తీసుకుంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వ ఖజానాలో ఎంత జమ అయిందన్న విషయం అధికారులకు తెలుస్తుందని, ఆ విషయం బయటకు రాకుండా అందరికీ మాముళ్లతో ఆకట్టుకున్నారు. పోలీసుల వద్ద అనుమానితులు ఈ మేరకు అంగీకరించినట్లు సమాచారం.

**ఫార్చ్యూనర్ కారు – థాయ్‌లాండ్ టూర్లు**

ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న యాదగిరిగుట్టకు చెందిన నిందితుడు బస్వరాజ్ ఒక్కడే రూ.11 కోట్లు కొట్టేసినట్లు, ఇతనికి పాండు అనే మరో వ్యక్తి సహకరించినట్లు తెలుస్తోంది. కొట్టేసిన సొమ్ముతో బస్వరాజ్ విలాసాలు అనుభవించినట్లు సమాచారం. ఖరీదైన ఫార్చ్యూనర్ కారు కొనడంతో పాటు అనేకమార్లు థాయ్‌లాండ్ సహా వివిధ దేశాల్లో పర్యటించినట్లు పోలీసులు గుర్తించారు. బస్వరాజ్ వద్ద 1,200లకు పైగా రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు దొరికినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఒక్క జనగామకు మాత్రమే పరిమితం కాదని, ఇలాగే రాష్ట్రవ్యాప్తంగా అనేక కేంద్రాల్లో జరిగిందని, ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఇంటర్నెట్ కేంద్రాల్లో రూ.లక్షల్లో కమీషన్లు**

సాగుభూముల రిజిస్ట్రేషన్ల పోర్టల్‌కు అక్రమార్కులు భారీగా కన్నమేశారు. రైతులు చెల్లించిన స్టాంపు డ్యూటీ, ఛార్జీలను దాదాపు మొత్తం దోచేస్తున్నారు. రైతులు రూ.లక్ష చెల్లిస్తే ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.1,000 మాత్రమే చేరుతుంది. మిగతా డబ్బును కమీషన్ల రూపంలో పంచుకుంటున్నట్లు సమాచారం. జనగామ జిల్లా కేంద్రంలో బయటపడిన ఈ వ్యవహారంలో పలు కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ లావాదేవీలు జరిగిన ఇంటర్నెట్ కేంద్రాల్లో ఈ–ఫైళ్లను నిపుణులు పరిశీలిస్తున్నారు. వాటి నిర్వాహకులు ముఠాగా ఏర్పడి దోపిడీకి పాల్పడ్డారని గుర్తించినట్లు సమాచారం.

## గ్రామాల పరిపాలనపై శిక్షణ

-మొదటిపేజీ తరువాయి

సభ్యులకు డివిజన్, మండల కేంద్రాల్లో ట్రైనింగ్ ఇవ్వనున్నారు.

**24 అంశాలపై అవగాహన**

గ్రామ పాలనలోని వ్యవస్థలు, నూతన పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు తదితర 24 అంశాలకు సంబంధించి అవగాహన కల్పించనున్నారు. గ్రామ సభల నిర్వహణ, పంచాయతీ సమావేశాలు, జనన, మరణాల నమోదు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, వ్యవసాయం, ఈ అప్లికేషన్, పంచాయతీరాజ్ ఈ పాలన, ఆర్థికాభివృద్ధిలో గ్రామ పంచాయతీల పాత్ర, కేంద్ర ఆర్థిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ నిధుల వినియోగం, ఖర్చు తదితర అంశాలపై సర్పంచులకు పూర్తిగా వివరించనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

**రీసోర్స్ పర్సన్‌లకు తర్ఫీదు పూర్తి**

సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు జిల్లాకు 8 మంది చొప్పున రీసోర్స్ పర్సన్‌లను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు కూడా ఉన్నారు. వీరికి ఈ నెల 5 నుంచి 10 వరకు హైదరాబాద్‌లోని టీజీ ఐఆర్‌డీ(గ్రామీణాభివృద్ధి సంస్థ)లో తర్ఫీదు ఇచ్చారు. వారు సంక్రాంతి పండుగ అనంతరం ఆయా జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పాటైన సందర్భంలో రాష్ట్రానికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,500 కోట్ల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇందులో రూ.వెయ్యి కోట్లను జనవరి నెలాఖరులోపు, రూ.1,500 కోట్లు వచ్చే నెలలో విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. రాష్ట్రంలో పంచాయతీ పాలకవర్గాలకు 2024 జనవరిలో గడువు ముగియగా 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్రం నుంచి నిధులు వచ్చాయి. 2024–25లో ఎన్నికలు జరగకపోవడంతో పాలకవర్గాలు లేక ఆ సంవత్సరానికి రావాల్సిన రూ.2,500 కోట్లను కేంద్రం నిలిపివేసింది. డిసెంబరు నెలలో మూడు విడతలుగా 12,702 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 7,522 గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకోగా, 820 సర్పంచి స్థానాల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు గెలిచారు. 62 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచి అగ్రస్థానంలో నిలిచింది. మిగతా స్థానాలను బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు గెలిచాయి.

## ఇది రేవంత్ సర్కార్ రాజకీయ వికృత క్రీడ



**హైదరాబాద్:** పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు అన్నారు. తెలంగాణవ్యాప్తంగా మీడియా ప్రతినిధులను, డిజిటల్ జర్నలిస్టులను పోలీసులు టార్గెట్ చేయడంపై ఆయన మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడం అక్రమమని అన్నారు. "మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా? ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా? జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవం పై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా– డిజిటల్ మీడియా పై సిట్‌లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గం. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారాయన. అంతేకాదు డీజీపీ శివధర్‌రెడికి ఫోన్ చేసి జర్నలిస్టులను విడుదల చేయాలని కోరారు. ఈ అరెస్టులను తెలంగాణ పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ఖండించారు. "అర్ధరాత్రిళ్లు అరెస్ట్ చేయడం కరెక్ట్ కాదు. సదరు జర్నలిస్టులకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుని ఉంటే బాగుండేది. జర్నలిస్టుల అరెస్టుతో యుద్ధ వాతావరణం ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదు" అని అభిప్రాయపడ్డారు. ఓ మంత్రి–ఐఏఎస్ అధికారిణి అంటూ.. ప్రముఖ చానెల్‌లో కథనం ప్రసారం అయ్యింది. దాని ఆధారంగా అటు సోషల్ మీడియాలో విస్తృత కథనాలు ప్రసారం అయ్యాయి. ఈ ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. మంత్రి కోమటిరెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఆ ప్రచారాన్ని ఖండించారు. ఈ క్రమంలో సదరు ప్రముఖ మీడియా సంస్థకు చెందిన జర్నలిస్టులను గత అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి ఇంటికెళ్లి తలుపులు బద్ధలు కొట్టి మరీ అరెస్ట్ చేశారని.. ఎలాంటి ప్రొసీజర్, నోటీసులు ఫాలో కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో.. రాష్ట్రంలో మరికొన్ని చోట్లా పోలీసులు పాత్రికేయుల్ని టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా పలు చానెల్స్, 40కి పైగా యూట్యూబ్ చానెల్స్‌పై పోలీసులు దృష్టిసారించినట్లు సమాచారం. అయితే అక్రమ అరెస్టులు.. పోలీసుల ప్రతాపంపై జర్నలిస్టుల సంఘాలతో పాటు పౌర హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి.

# మ్యాన్ హోల్స్, మురుగు కాలువలను క్లీన్ చేసే రోబోట్

పారిశుధ్య కార్మికులు మురుగు కాలువల్లోకి దిగి ప్రాణాలను కోల్పోకుండా ఉండేందుకు ఇద్దరు విద్యార్థినిలు అద్భుత ఆవిష్కరణ చేశారు. మ్యాన్ హోల్స్, మురుగు కాలువల లోపలికి వెళ్లి వాటిని శుభ్రం చేసి తనిఖీ చేయగల రోబోట్‌ను అభివృద్ధి చేశారు. వారే ఛత్తీస్‌ఘఢ్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కవితా సాహు, అంజలి చౌహాన్. ఈ అద్భుత ఆవిష్కరణ చేపట్టినందుకుగానూ కవితకు రాష్ట్రపతితో విందు చేసే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరు స్టూడెంట్స్ అభివృద్ధి చేసిన రోబోట్ ఎలా పనిచేస్తుంది? దాని వల్ల ఉపయోగాలేంటి? తదితర విషయాలు తెలుసుకుందాం.



### అద్భుత ఆవిష్కరణ చేసిన స్టూడెంట్స్

దుర్గ్ జిల్లాలోని వైశాలి నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కవితా సాహు తొమ్మిదో తరగతి, అంజలి పదకొండో క్లాస్ చదువుతోంది. ఈ ఇద్దరూ విద్యార్థినిలు కలిసి మ్యాన్ హోల్స్, మురుగు కాలువల లోపలికి వెళ్లి వాటిని శుభ్రం చేసి తనిఖీ చేయగల రోబోట్‌ను సృష్టించారు. ఈ రోబోట్ పారిశుధ్య కార్మికులు మురుగు కాలువల్లోకి దిగి తమ ప్రాణాలను కోల్పోకుండా కాపాడుతుంది. దీంతో ఈ ఇద్దరు స్టూడెంట్స్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి.

### పేద కుటుంబాల నుంచి వచ్చినా!లి

కవితా సాహు తండ్రి ఆటో డ్రైవర్ కాగా, అంజలి చౌహాన్ తండ్రి పారిశుధ్య కార్మికుడు. అయితే పరిమిత వనరులు, సవాళ్లు ఉన్నప్పటికీ కవిత, అంజలి తాము అనుకున్నది సాధించారు. పారిశుధ్య కార్మికుల కోసం అద్భుత ఆవిష్కరణ చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. టాలెంట్ ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. ఈ రోబోట్ పైపు ఆకారానికి అనుగుణంగా ఉంటుందని ఆవిష్కర్తలో ఒకరైన కవితా సాహు తెలిపింది. విషపూరిత వాయువులు ఉన్న ప్రాంతాలలో ఇది పనిచేస్తుందని పేర్కొంది. ఇరుకైన ప్రదేశాలను కూడా తనిఖీ చేసి శుభ్రపరుస్తుందని వెల్లడించింది. ఈ నమూనాను పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రూపొందించామని స్పష్టం చేసింది. అక్కడ కెమిస్ట్రీ లెక్చరర్ రీతూ హండా తమకు మార్గనిర్దేశం చేశారని పేర్కొంది. తన తోటి ఆవిష్కర్త అంజలి చౌహాన్ తండ్రి పారిశుధ్య కార్మికుడని కవిత వివరించింది. ఆయన నిరంతరం అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్పష్టం చేసింది. అదే పారిశుధ్య కార్మికుల ఈ ప్రమాదకరమైన పనికి సురక్షితమైన ప్రత్యామ్నాయం ఉందా? అని ఆలోచించేలా చేసిందని పేర్కొంది. ఈ ఆలోచనే తమను క్లీనర్ రోబోట్ సృష్టికి దారితీసిందని వెల్లడించింది.

### కేంద్ర మంత్రిని కలవనున్న అంజలి

మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసే అవకాశాన్ని అంజలి చౌహాన్ ఒక ప్రత్యేక క్షణంగా అభివర్ణించింది. విద్యార్థి జీవితంలో ఇంత ముఖ్యమైన విజయాన్ని సాధించడం చాలా ప్రత్యేకంగా ఉందని పేర్కొంది. తాము అందుకు చాలా సంతోషంగా ఉన్నామని వెల్లడించింది. మరోవైపు, తమ పాఠశాల విద్యార్థినిలు కవితా సాహు, అంజలి చౌహాన్ చేసిన ఆవిష్కరణ పట్ల ప్రిన్సిపల్ సంగీతా సింగ్ బఘేల్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణను విద్యార్థుల వినూత్న సామర్థ్యాలకు అద్భుతమైన ఉదాహరణగా అభివర్ణించారు. తమ ప్రాంతానికి ఇదొక స్ఫూర్తిదాయకమైన విజయంగా అభిప్రాయపడ్డారు. "ఈ బాలికలు ఇంత గొప్ప ఘనత సాధిస్తారని మేము ఎప్పుడూ ఊహించలేదు. కానీ వీరు కష్టపడి పనిచేయడంలో కెమిస్ట్రీ లెక్చరర్ రీతూ హుండా మేడమ్ కీలక పాత్ర పోషించారు. ఆమె మార్గదర్శకత్వంలో వారు ఈ ఘనతను సాధించారు. వైఫల్యాల తర్వాత కూడా ఆమె విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోనివ్వలేదు. ఏదైనా పని చేయకపోతే పిల్లలు మధ్యలోనే తరచుగా వదులుకుంటారు. కానీ రీతూ మేడమ్ ఎప్పుడూ వారిని అండగా ఉన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మేము చేయగలిగినదంతా చేశాం. ఆటో డ్రైవర్ కూతురు, ప్రభుత్వ పాఠశాల స్టూడెంట్ చాలా మంది నేషనల్ స్కూల్స్ విద్యార్థుల మధ్య ప్రజెంటేషన్ ఇచ్చింది. దీంతో ఆమె ప్రాజెక్టు ఎంపికైంది. ఇదొక గొప్ప విజయం."

### రాష్ట్రపతి విందుకు ఆహ్వానం

నీతి ఆయోగ్ నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో దేశవ్యాప్తంగా దాదాపు 1.5 లక్షల ఎంట్రీలు వచ్చాయి. అందులో కవితా సాహు, అంజలి చౌహాన్ అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్టు టాప్-10లో నిలిచింది. ఈ ఘనత తర్వాత జనవరి 26న రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి విందులో పాల్గొనే అవకాశం కవితా సాహుకు లభించింది. అంజలి చౌహాన్‌కు కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసే ఛాన్స్ వచ్చింది. అందుకోసం జనవరి 23న ఇద్దరు విద్యార్థులు తమ గురువుతో కలిసి దిల్లీకి వెళ్లనున్నారు.

# 'సీఎం మార్పు'పై క్లారిటీ కోరిన డీకే, సిద్ధరామయ్య దిల్లీకి రావాలన్న రాహుల్- ఏం జరగబోతోంది?

రాహుల్ గాంధీ తాజా పర్యటనతో 'సీఎం మార్పు' అంశం కర్ణాటకలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై ఒక్కో వైపు నుంచి ఒక్కో రకం సమాచారం బయటికొస్తోంది. షరా మామూలుగానే సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ లేదు లేదు, కాదు కాదు అని మంగళవారం రోజు బదులిచ్చారు. కానీ దీనిపై చర్చించేందుకు సంక్రాంతి తర్వాత దిల్లీకి రావాలని సిద్ధరామయ్య, డీకేలకు రాహుల్ సూచించారని కాంగ్రెస్ వర్గాలు చెప్పాయి. ఈనేపథ్యంలో బుధవారం కర్ణాటక డిప్యూటీ సీఎం స్వరం మార్చారు. జనవరి 16న దిల్లీకి వెళ్తున్నానని ప్రకటించారు. సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ, దీనిపై మాట్లాడే అధికారం తనకు, డీకేకు మాత్రమే ఉందన్నారు. ఇంతకీ కన్నడ నాట ఏం జరగబోతోంది? కాంగ్రెస్ హైకమాండ్ మనసులో ఏముంది? సిద్ధరామయ్య, డీకే వ్యాఖ్యలు ఇస్తున్న సంకేతాలు ఏమిటి? ఈ కథనంలో చూద్దాం.





### క్లారిటీ కోరిన సీఎం, డిప్యూటీ సీఎం?

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక విమానంలో కర్ణాటకలోని మైసూరులో ఉన్న మండకల్లి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వాగతం పలికారు. కొన్ని నిమిషాల పాటే ఆ ఎయిర్‌పోర్టులో రాహుల్ ఉన్నారు. ఈ అతి స్వల్ప వ్యవధిలోనే రాహుల్ ఎదుట సీఎం మార్పు అంశాన్ని సిద్ధరామయ్య, డీకే ప్రస్తావించారనే టాక్ వినిపిస్తోంది. దీనిపై ఊహాగానాలకు ముగింపు పలికేలా క్లారిటీని ఇవ్వమని వారు కోరారనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపైనా దిశానిర్దేశం చేయమని రాహుల్‌ను సీఎం కోరినట్లు సమాచారం. ఈ అంశాలపై చర్చించడానికి సంక్రాంతి తర్వాత దిల్లీకి రావాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు రాహుల్ సూచించారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం నిర్దిష్ట తేదీని రాహుల్ చెప్పలేదని పేర్కొన్నాయి. ఈ స్వల్ప మంతనాలు ముగిసిన వెంటనే ప్రత్యేక హెలికాప్టర్‌లో తమిళనాడులోని గుడలూర్‌కు రాహుల్ గాంధీ వెళ్లారు.

### రాహుల్‌ను రెండోసారి కలిసిన డీకే

దిల్లీకి తిరిగి వెళ్లేందుకు మంగళవారం సాయంత్రంకల్లా గుడలూర్ నుంచి మండకల్లి విమానాశ్రయానికి హెలికాప్టర్‌లో రాహుల్ చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయనతో డిప్యూటీ సీఎం డీకే కాసేపు సంభాషించారు. విమానాశ్రయంలో రాహుల్, డీకే మాట్లాడుకున్న ఫొటోలు కర్ణాటక అధికార పక్షంలో సంచలనం సృష్టించాయి. ఇంతకీ వారు ఏం చర్చించారు ? డీకే ఏం అడిగారు? రాహుల్ ఏం చెప్పారు? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ భేటీ తర్వాత ప్రత్యేక విమానంలో దిల్లీకి రాహుల్ వెళ్లిపోయారు.

### జనవరి 16న దిల్లీకి వెళ్తాను : డిప్యూటీ సీఎం డీకే

ఈ పరిణామంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం కీలక వ్యాఖ్యలు చేశారు. జనవరి 16న తాను దిల్లీకి వెళ్తున్నట్లు వెల్లడించారు. తాను కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడి హోదాలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో జరిపిన సమావేశాలు, చర్చల వివరాలను బయటికి చెప్పలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ మీటింగ్‌లన్నీ కాంగ్రెస్ పార్టీ ప్రొటోకాల్ ప్రకారం జరుగుతాయన్నారు. సీఎం మార్పు అంశంపై రాహుల్, తాను అస్సలు డిస్కస్ చేయలేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చడం, కర్ణాటక రాష్ట్ర అభివృద్ధి, స్థానిక రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో బీజేపీ రాజకీయాలపై చర్చించామని డీకే తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు పనితీరు బాగానే ఉందని, అలాగే పనిని కొనసాగించమని రాహుల్ సూచించారన్నారు.

### సీఎం మార్పుపై మేమిద్దరమే మాట్లాడాలి సీఎం సిద్ధరామయ్య

డీకే తాజా వ్యాఖ్యలపై సీఎం సిద్ధరామయ్య బుధవారం స్పందించారు. సీఎం మార్పు అంశంపై మాట్లాడే అధికారం తనకు లేదా ఉప ముఖ్యమంత్రి డీకేకు మాత్రమే ఉందన్నారు. దీనిపై ఎమ్మెల్యేల కంటే మీడియానే ఎక్కువగా చర్చిస్తోందని ఆయన మండిపడ్డారు. దీనిపై కొంతమంది అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇటీవలే చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, పరిస్థితి గురించి వారికి పూర్తిగా అవగాహన లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అధికార పంపిణీపై విభేదాలు లేవని, ఈ ఊహాగానాలన్నీ మీడియా సృష్టేనని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. మంగళవారం రోజు రాహుల్ గాంధీతో ఎటువంటి రాజకీయ చర్చలు జరపలేదన్నారు. తద్వారా కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలే తనకు శిరోధార్యం అనే సంకేతాన్ని సిద్ధరామయ్య ఇచ్చారు.

### సంక్రాంతి తర్వాతే దిల్లీకి డీకే, సిద్ధు

దిల్లీకి రావాలని కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంలకు రాహుల్ గాంధీ సూచించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అశోక్ పట్టన్ బుధవారం బెంగళూరులో వెల్లడించారు. అయితే ఏ తేదీన వారిద్దరితో కాంగ్రెస్ పెద్దలు భేటీ అవుతారు అనేది నిర్దిష్టంగా తెలియదన్నారు. డేట్ ఫిక్స్ అయ్యాక సిద్ధరామయ్య, డీకే దిల్లీకి వెళ్తారన్నారు. సంక్రాంతి తర్వాతే ఈ డేట్ ఫిక్స్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అశోక్ పట్టన్ పేర్కొన్నారు. మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆశగా ఎదురు చూస్తున్నారని, ఆశావహుల జాబితాలో తాను కూడా ఉన్నానని ఆయన తెలిపారు.

### కాంగ్రెస్ ఏం చేయబోతోంది?

కర్ణాటకలో సీఎం మార్పు అంశంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గతంలో కీలక వ్యాఖ్య చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంలతో కాంగ్రెస్ హైకమాండ్ చర్చలు జరిపే తేదీని ముందే బహిర్గత పర్చలేమని ఆయన స్పష్టం చేశారు. అవసరమైనప్పుడు పార్టీ హైకమాండ్ నేరుగా వారిని పిలిచి మాట్లాడుతుందన్నారు. దిల్లీకి వచ్చి కలవాలని రాహుల్ గాంధీ కూడా డీకే, సిద్ధరామయ్యలకు సూచించారనే టాక్ వినిపిస్తోంది. తద్వారా సీఎం మార్పుపై చర్చలకు తాము సిద్ధమనే సంకేతాలను కాంగ్రెస్ హైకమాండ్ పంపుతోంది. సామరస్యంగా, లౌక్యంతో దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనే దిశగా అడుగులు వేస్తోంది. మరోవైపు దీనిపై డీకే శివకుమార్ పట్టు వీడటం లేదని తేటతెల్లం అవుతోంది. చెరో రెండున్నర ఏళ్లపాటు సీఎం పదవి పంపకంపై 2023లో తనకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేస్తున్నారని సంబంధిత వర్గాలు అంటున్నాయి. 2025 నవంబరు 20 నాటికే కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు రెండున్నర ఏళ్ల పాలనా కాలాన్ని పూర్తి చేసుకుంది. నాటి నుంచే సీఎం మార్పు అంశంపై రాజకీయ ప్రతిష్టంభన నెలకొంది. ఈ ఏడాది దీనిపై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ



పశ్చిమ బెంగాల్ లో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీకి, సీఎం మమతా బెనర్జీ (టీఎంసీ)కి మధ్య వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఐ-ప్యాక్ సంస్థపై ఈడీ జరిపిన దాడుల్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారు. ఐ ప్యాక్ కార్యాలయానికి వెళ్లి మరీ.. కొన్ని డాక్యుమెంట్లను తనతో తీసుకెళ్లారు. దీంతో మమత చర్యకు వ్యతిరేకంగా ఈడీ.. కోల్ కతా హైకోర్టును ఆశ్రయించింది. మమత బెనర్జీ కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లి, నేరానికి పాల్పడ్డారని ఆరోపించింది. అయితే, ఈడీ ఆరోపణలను ఖండిస్తూ మమతా బెనర్జీకి చెందిన టీఎంసీ, ఐ-ప్యాక్ సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. తమ డాక్యుమెంట్లను ఈడీ అక్రమంగా తీసుకెళ్లిందని, తమ పార్టీకి సంబంధించిన అంతర్గత వివరాల్ని సేకరించాలనుకుందని టీఎంసీ ఆరోపించింది. తమ ప్రైవసీకి భంగం కలిగించాలని ఈడీ ప్రయత్నించిందని కోర్టుకు తెలిపింది. తమ వద్ద సేకరించిన డాటాను భద్రంగా ఉంచేలా ఆదేశించాలని కోరింది. తమ పార్టీ వివరాల్ని, ప్రణాళికల్ని బయటపెట్టాలని చూడటం సరికాదని తెలిపింది. అయితే, ఈ ఆరోపణల్ని ఈడీ కొట్టిపారేసింది. తాము ఎలాంటి డాక్యుమెంట్లు తీసుకెళ్లలేదని కోర్టుకు తెలిపింది. తమ చర్యల వల్ల టీఎంసీకి ఎలాంటి నష్టం లేదని కోర్టుకు తెలిపింది. ఇరువురి వాదనలు విన్న జస్టిస్ సువ్ర ఘోష్.. ప్రాథమిక సాక్ష్యాల ఆధారంగా టీఎంసీ పిటిషన్లను కొట్టివేశారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టులో తేల్చుకోవాలని సూచించారు.

## శబరిమలలో కనులపండువగా మకరజ్యోతి దర్శనం



కేరళలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలలో మకరజ్యోతి దర్శనం అశేష భక్తజన సందోహం మధ్య కనులపండువగా జరిగింది. మకర సంక్రాంతి పుణ్యదినమైన బుధవారం సాయంత్రం 6:30 గంటల తర్వాత పొన్నాంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించిన లక్షలాది మంది భక్తులు "స్వామియే శరణం అయ్యప్ప" అంటూ చేసిన శరణుఘోషతో శబరిగిరులు మార్మోగిపోయాయి. అంతకుముందు, పందళం రాజప్రాసాదం నుంచి తీసుకొచ్చిన పవిత్రమైన తిరువాభరణాలను అయ్యప్ప స్వామికి అలంకరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. ఆ వెంటనే పొన్నాంబలమేడు కొండపై దివ్యజ్యోతి కనిపించడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. మకరజ్యోతిని సాక్షాత్తు అయ్యప్ప స్వామి జ్యోతిర్మయ రూపంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ జ్యోతిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోయి, కోరిన కోరికలు నెరవేరతాయని ప్రగాఢంగా నమ్ముతారు. మకరజ్యోతి దర్శనం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. రద్దీని నియంత్రించేందుకు కొండపైకి పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతించారు. క్షేత్రానికి రాలేని భక్తుల కోసం పలు టీవీ ఛానెళ్లు, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందించాయి. ఏటా మకర సంక్రాంతి నాడు జరిగే ఈ వేడుక కోసం దేశ నలుమూలల నుంచి భక్తులు 41 రోజుల కఠిన దీక్షతో శబరిమలకు చేరుకుంటారు.

## తక్షణమే ఇరాన్‌ను వీడండి




ఇరాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతోన్న ఆందోళనల కారణంగా అక్కడ మారణహోమం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది మృతి చెందగా, అందులో ఆందోళనకారులు 1,850 మంది, భద్రతా దళాల సిబ్బంది 135 మంది ఉన్నారు. ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా పదుల సంఖ్యలో మరణించారు. ఆ దేశంలో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్‌లో ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులను అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు (విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు) అందుబాటులో ఉన్న విమానాల ద్వారా వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లిపోవాలి" అని పేర్కొంది. తీవ్రమవుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల కారణంగా టెహ్రాన్‌తో సహా ఇరాన్‌లోని పలు నగరాల్లో పరిస్థితి మరింత దిగజారిందని రాయబార కార్యాలయం హెచ్చరించింది. నిరసన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించింది. రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించాలని భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులకు తెలిపింది. ఆకస్మిక తరలింపు లేదా అత్యవసర ప్రయాణానికి సిద్ధంగా ఉండాలని తెలిపింది. తక్షణ సహాయం కోసం రాయబార కార్యాలయం అత్యవసర సంప్రదింపు ఫోన్ నెంబర్లను, అధికారిక ఈ-మెయిల్ ఐడీని పంచుకుంది. హెల్ప్‌లైన్ నెంబర్లు 98-9128109115, 98-9128109109, 98-9128109102, 98-9932179359 కాగా, ఈ-మెయిల్ ఐడీ ఎశీఅర్.వప్ట్రతీఖఅఏఎఖు.స్త్రశీజ.అఅ లను పంచుకుంది. తదుపరి నోటీసు వచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణం చేయవద్దని భారత విదేశాంగ శాఖ కూడా



# రోజూ సోంపును ఇలా తీసుకుంటే అద్భుతాలే..

వంటగదిలో ఉండే సుగంధ ద్రవ్యాలు కేవలం రుచికే కాదు, ఆరోగ్యానికి కూడా అమృతంతో సమానం. ముఖ్యంగా ఊబకాయం, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వుతో బాధపడేవారికి సోంపు ఒక వరం లాంటిది. సోంపును సరైన పద్ధతిలో తీసుకుంటే అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల నేడు చాలామందిని వేధిస్తున్న ప్రధాన సమస్య ఊబకాయం. జిమ్‌లకు వెళ్లలేక, కఠినమైన డైట్ చేయలేక ఇబ్బంది పడేవారికి మన వంటింట్లో ఉండే సోంపు అద్భుతమైన పరిష్కారాన్ని చూపుతుంది. అజీర్ణం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలకే కాకుండా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడంలో సోంపు కీలకంగా పనిచేస్తుంది. ఒక చెంచా సోంపును రాత్రంతా నీటిలో నానబెట్టండి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని మరిగించి, వడకట్టి ఖాళీ కడుపుతో తాగాలి. దీనివల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే శరీరంలో వచ్చే మార్పును మీరే గమనిస్తారు. ఒక గ్లాసు నీటిని మరిగించి, అందులో ఒక చెంచా సోంపు, చిన్న అల్లం ముక్క వేయాలి. స్టవ్ ఆఫ్ చేసిన తర్వాత కొన్ని పుదీనా ఆకులు వేసి రెండు నిమిషాలు మూత పెట్టాలి. ఆ తర్వాత వడకట్టి, అర చెంచా తేనె కలుపుకుని తాగాలి. ఇది జీవక్రియను వేగవంతం చేసి కొవ్వును త్వరగా కరిగిస్తుంది. సోంపును పాన్ మీద 2-3 నిమిషాలు దోరగా వేయించి, చల్లారాక మిక్సీ పట్టి పొడి చేసుకోవాలి. ఈ పొడిని గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ప్రతిరోజూ భోజనం చేసిన తర్వాత ఒకటి లేదా రెండు చిటికెల పొడిని తీసుకుంటే ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. 4 చెంచాల సోంపు, 2 చెంచాల జీలకర్ర, 2 చెంచాల మెంతులు కలిపి వేయించి పొడి చేసుకోవాలి. ఈ పొడిలో ఒక చెంచా పసుపు, ఒక చెంచా నల్ల ఉప్పు, తగినంత తేనె కలిపి చిన్న ఉండలుగా చుట్టుకోవాలి. రోజుకు ఒక ఉండ చొప్పున తీసుకుంటే శరీరంలోని అసమతుల్యత తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# పచ్చిమిర్చితో ఇన్ని అద్భుతాలా



పచ్చిమిరపకాయ కారం అని తెలిసినా, కళ్లలో నీళ్లు తిరుగుతున్నా ఆ రుచిని మనం వదులుకోలేం. ఈ మిర్చి కేవలం కారాన్ని మాత్రమే కాదు.. మన ఆరోగ్యానికి ఒక సంజీవని లాంటి ప్రయోజనాలను కూడా ఇస్తుందని మీకు తెలుసా? భారతీయ భోజనంలో పచ్చిమిరపకాయది ప్రత్యేక స్థానం. కూరగాయల మార్కెట్‌కు వెళ్తే.. పచ్చిమిరపకాయలు లేనిదే తిరిగి రారు. కళ్లలో నీళ్లు తెప్పించే ఈ పచ్చిమిరపకాయ కేవలం కారం మాత్రమే కాదు.. అది మన శరీరానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. పచ్చిమిర్చిలో దాగున్న ఆ 5 అద్భుత ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. పచ్చిమిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ అనే సమ్మేళనం శరీర జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు వేగంగా కరుగుతుంది. మీరు రుచికరమైన కారంగా ఉండే ఆహారం తింటూనే బరువు తగ్గవచ్చు. నారింజ పండ్లలో కంటే పచ్చిమిర్చిలో విటమిన్ సి అధికంగా ఉంటుందని మీకు తెలుసా? ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మంపై ముడతలను తగ్గించి ముఖానికి సహజమైన కాంతిని ఇస్తుంది. యవ్వనంగా కనిపించాలనుకునే వారికి పచ్చిమిర్చి ఒక సహజ సౌందర్య సాధనం. పచ్చిమిరపకాయలు రక్తంలోని కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది రక్తం గడ్డకట్టడాన్ని నివారించి, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల పచ్చిమిర్చి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్రమం తప్పకుండా మితంగా పచ్చిమిరపకాయలను తీసుకునే వారికి జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లు అంత త్వరగా దరిచేరవు. మితంగా పచ్చిమిర్చి తీసుకోవడం వల్ల లాలాజల ఉత్పత్తి పెరిగి, ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది ప్రేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. ఏదైనా అతిగా తింటే ప్రమాదమే. పచ్చిమిరపకాయలు ఎక్కువగా తింటే కడుపులో మంట, అసిడిటీ లేదా పైల్స్ వంటి సమస్యలు రావచ్చు. అందుకే రోజువారీ ఆహారంలో 2 నుంచి 3 పచ్చిమిరపకాయల కంటే ఎక్కువ తీసుకోకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# రెడ్ మీట్‌ను ఇలా తింటే ఆ రోగాలను ఆహ్వానించినట్టే.!



చాలామంది ప్రోస్టేట్ సమస్యలు వయసుతో వస్తాయని భావిస్తారు. కానీ వేయించిన మాంసం, ప్రాసెస్డ్ ఫుడ్స్ దీనికి ప్రధాన కారణం. మూత్ర సంబంధిత ఇబ్బందులు, నొప్పి లాంటి లక్షణాలు తీవ్రమయ్యే ముందు సరైన ఆహారంతో క్యాన్సర్ లాంటి ముప్పులను నివారించవచ్చు. వయసు పెరుగుతున్న కొద్దీ పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంథి సమస్యలు రావడం సాధారణమని చాలామంది నమ్ముతారు. అయితే, అది కరెక్ట్ కాదు. ఎందుకంటే మనం రోజువారీ తీసుకునే ఆహారం ఈ సమస్యలకు కీలక పాత్ర పోషిస్తుంది. మూత్రవిసర్జనలో ఇబ్బందులు, నొప్పి లాంటి లక్షణాలు తీవ్రమయ్యేవరకు చాలామంది ప్రోస్టేట్ ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ, ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్ లాంటి తీవ్రమైన సమస్యలను కూడా సమర్థవంతంగా నివారించవచ్చు. ప్రోస్టేట్ గ్రంథి పాడవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీటిలో మూత్ర సంబంధిత ఇబ్బందులు కూడా ఉన్నాయి. తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి రావడం, మూత్రాశయంలో నొప్పి, లేదా మూత్ర విసర్జన సమయంలో మంటగా ఉండటం లాంటివి లక్షణాలుగా చెప్పుకోవచ్చు. వీటితో పాటు పెల్విక్ లేదా నడుము నొప్పి, తుంటి దగ్గర అసౌకర్యం లేదా నొప్పి లాంటివి కూడా ఈ గ్రంథి చెడిపోవడం వల్ల వచ్చే సమస్యలు. లైంగిక బలహీనత, మూత్రం లేదా వీర్యంలో రక్తం కనిపించడం, ప్రోస్టేట్ క్యాన్సర్ లాంటి లక్షణాలు కూడా ఏర్పడవచ్చు. ప్రోస్టేట్ ఆరోగ్యకరంగా ఉండాలంటే మనం సరైన ఆహారం తీసుకోవాల్సిందే. ముఖ్యంగా అతిగా వేయించిన మాంసం, ప్రాసెస్డ్ మీట్ ఈ సమస్యకు ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెడ్ మీట్‌ను అధిక ఉష్ణోగ్రత వద్ద కాల్చినప్పుడు లేదా వేయించినప్పుడు, అందులో హెటిరో సైక్లిక్ అమైన్స్ లాంటి హానికర రసాయనాలు విడుదలవుతాయి. ఈ రసాయనాలు ప్రోస్టేట్ గ్రంథిలో వాపును కలిగించి, కణాల అసాధారణ వృద్ధికి దోహదం చేస్తాయి. అలాగే, సోడియం, ప్రిజర్వేటివ్స్ ఎక్కువగా ఉండే సాసేజ్‌లు, బేకాన్ లాంటి ప్రాసెస్డ్ ఆహారాలను ఎంత త్వరగా మానేస్తే ప్రోస్టేట్ ఆరోగ్యానికి అంత మంచిది. ప్రోస్టేట్ సమస్యలను దూరం చేయాలంటే ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం మంచిది. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లను తీసుకోవడం వల్ల ప్రోస్టేట్ సమస్యలను అడ్డుకోవచ్చు. అలాగే టమాటాలు, పుచ్చకాయ లాంటి లైకోపిన్ అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవడం ప్రోస్టేట్ గ్రంథి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిరోజు తగినంత నీరు తాగడం వల్ల శరీరం డిహైడ్రేషన్ బారిన పడకుండా ఉండొచ్చు. శారీరక శ్రమ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది.

# ఈ టైంలో పండ్ల జ్యూస్ తాగారంటే.. ఒంట్లో విష పదార్థాలు హాంఫట్!



తాజా పండ్ల జ్యూస్‌లు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు ఎన్నో అందిస్తాయి. పండ్ల రసం తాగడానికి సరైన సమయం ఎప్పుడు? ఆరోగ్యంగా ఉండటానికి ఆహారంలో పండ్లను చేర్చుకోవడం మంచిదన్న సంగతి అందరికీ తెలిసిందే. చాలా మంది పండ్లు తినడానికి బదులుగా పండ్ల రసం తాగడానికి ఇష్టపడతారు. అయితే వేళాపళా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు పండ్ల జ్యూస్‌లు తాగడం వల్ల ప్రయోజనకరంగా ఉండటానికి బదులుగా ఆరోగ్యానికి హాని తలపెడతాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం జ్యూస్ తాగడానికి ఒక నిర్దిష్ట సమయం ఉంది. ముఖ్యంగా ఉదయం పండ్ల రసం తాగడానికి ఉత్తమ సమయంగా పరిగణించబడుతుంది. రాత్రి నిద్ర తర్వాత, శరీరానికి శక్తి అవసరం. దీనిని తాజా పండ్ల రసం నుంచి వెంటనే పొందవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో లేదా అల్పాహారంతో జ్యూస్ తాగడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. వ్యాయామం లేదా వ్యాయామం చేసిన అరగంట తర్వాత జ్యూస్ తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది వ్యాయామం సమయంలో ఖర్చు చేసిన శక్తిని పునరుద్ధరించడంలో సహాయపడుతుంది. ఉదయం జ్యూస్ తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్ స్థాయిలు సమతుల్యంగా ఉంటాయి. అయితే రాత్రి పడుకునే ముందు పండ్ల రసం ఎప్పుడూ తాగకూడదు. ఇందులో సహజ చక్కెర (ఫ్రక్టోజ్) ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను పెంచుతుంది. నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. రాత్రిపూట జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. భోజనంతో పాటు జ్యూస్ తాగడం మానుకోవాలి. ఎందుకంటే ఇది జీర్ణ ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. గ్యాస్ లేదా అజీర్ణానికి కారణమవుతుంది. అదే సమయంలో జ్యూస్‌లో చక్కెర జోడించకుండా ఉండండి. ప్యాక్ చేసిన జ్యూస్‌ల కంటే తాజాగా తయారుచేసిన ఇంట్లో తయారుచేసిన జ్యూస్‌లను తాగడం మంచిది. ఈ జ్యూస్‌లలో ఫైబర్ తక్కువగా ఉంటుంది కాబట్టి, వీలైతే పండ్లు తినడం ఇంకా మంచిది.

# అధ్వానంగా రహదారి



**కూనవరం:** నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే కొండ్రాజుపేట రహదారికి మోక్షం లభించడం లేదు. టేకులబోరు నుంచి కొండ్రాజుపేట మీదుగా చినార్కూరు, పెదార్కూరు, కూటూరు మీదుగా చింతూరు మండలం చట్టి వరకూ ఉన్న రహదారి భారీ గోతులతో అధ్వానంగా మారింది. ఇది ఏడు పంచాయతీల పరిధిలోని 30 గ్రామాల గిరిజనులకు దగ్గర మార్గం. అర్ధ శతాబ్దం కిందట జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ రహదారిని ఆ తర్వాత పట్టించుకునే నాథుడే లేడని గిరిజనులు వాపోతున్నారు.

**అభివృద్ధికి దూరం**

కొండ్రాజుపేట రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు ఏళ్ల తరబడి అధికారులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. చింతూరు ఐటీడీఏలో అనేకసార్లు దరఖాస్తులు కూడా ఇచ్చారు. అయినా రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. ఈ రోడ్డుకు ఇరువైపులా వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ట్రాక్టర్లు, వ్యాన్లు, ఆటోలపై వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్లడం, సాయంత్రం కాగానే ఇళ్లకు చేరుకోవడం జరుగుతుంది. రైతులు ఎరువులు, పురుగు మందులు, మిర్చి, పొగాకు నారును (మొక్కలను) పొలాలకు తరలిస్తుంటారు. వాహనాల రద్దీ ఎక్కువ ఉండడంతో కొండ్రాజుపేట రహదారిపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం వస్తే ఆ గోతుల్లో నీరు నిండిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ద్విచక్ర వాహన చోదకులు ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు.

**మాజీ ఎంపీ చొరవతో..**

గిరిజనులు వివిధ పనులపై మండల కేంద్రానికి రావడానికి ఈ రోడ్డే దగ్గరి మార్గం. అర్ధ శతాబ్దం క్రితం మెటల్ రోడ్డుగా ఉండేది. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో దీన్ని టేకులబోరు నుంచి చింతూరు మండలం చట్టి వరకు తొలుత గ్రావెల్ రోడ్డు, కొద్ది కాలం తర్వాత మెటల్ రోడ్డుగా నిర్మించారు. 1997లో మాజీ ఎంపీ సోడె రామయ్య చొరవతో టేకులబోరు నుంచి జిన్నెలగూడెం వరకు ఆరు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకూ ఈ రోడ్డుపై తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గోదావరి వరదలు**

గోదావరి వరదలు ఈ రహదారికి శాపంగా మారాయి. తరచూ వచ్చే వరదలకు రోడ్డు ఎక్కడికక్కడ కొట్టుకు పోయింది. కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. కొండ్రాజుపేట వాగుపై ఉన్న లోలెవెల్ కాజ్‌వే ఎత్తు పెంచితే ఎగువనున్న గిరిజన గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. వరద ముప్పు నుంచి ఉపశమనం పొందాలంటే కనీసం 10 అడుగుల మేర ఎత్తు పెంచాలని సూచిస్తున్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వరదొస్తే చాలు కొండ్రాజుపేట కాజ్‌వే ముంపునకు గురవుతోంది. తద్వారా 15 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వరదలు తగ్గిన అనంతరం దాదాపు నెల రోజుల వరకు ఈ రహదారిపై రాకపోకలు సాగించడం నరక ప్రాయంగా మారుతుంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే కాజ్‌వే ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. ఆ మేరకు ఎత్తు పెంచితే భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయినా కొండ్రాజుపేట, టేకులబోరు గ్రామాల మధ్య రాకపోకలు సాగే అవకాశం ఉంటుందని గిరిజనులు చెబుతున్నారు.

# గ్రామీణ కలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు..

## సర్పంచుల ఫోరం సుల్తానాబాద్ మండల సహాయ కార్యదర్శి ఉప్పు లక్ష్మి



**సుల్తానాబాద్ :** గ్రామీణ కళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయని మంచరామి సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల సహాయక కార్యదర్శి ఉప్పు లక్ష్మి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని మంచరామి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం సర్పంచ్ ఉప్పు లక్ష్మి-తిరుపతి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. హరిదాసుల విన్యాసాలు పలువురిని అల్లరించాయి. న్యాయ నిర్ణయితలుగా లక్ష్మణ్, శారద వ్యవహరించారు. అనంతరం విజేతలకు సర్పంచ్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. మొదటి, ద్వితీయ, మూడో బహుమతితో పాటు ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక మహిళకు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎగుర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్న పిల్లలకు కుర్చీల ఆటలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వీరి తో పాటు మహిళలకు కుర్చీల ఆటలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

# అతలాకోతలం

**ప్రమాదకరంగా అంతర్వేది సాగర సంగమం**

**గోదావరి వైపు పెరిగిన కోత**

**లైట్ హౌస్ వద్ద మలుపు అత్యంత ప్రమాదం**



**సఖినేటిపల్లి:** సముద్రం అంటే అందరికీ ఎంతో ఇష్టం. ఆ తీరంలో సరదాగా గడపటానికి పిల్లలతో పాటు పెద్దలు కూడా ఇష్టపడతారు. ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తారు. కానీ అదే సమయంలో తీరంలో ప్రమాదం పొంచి ఉంటుంది. ముఖ్యంగా అంతర్వేది సాగర సంగమం మృత్యుకుహరాన్ని తలపిస్తోంది. ఇక్కడ సముద్ర కెరటాల ప్రభావం కంటే శాంతంగా ఉండే గోదావరి లోతు మరింత ప్రమాదంగా మారింది. ఇటీవల ఈ మలుపును గుర్తించలేని ఓ యువకుడు తన వాహనంతో గోదావరిలో దిగబడి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అమావాస్య, పౌర్ణమి, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ఆటుపోట్లుకు అటు సాగరం, ఇటు గోదావరి గర్భంలో వస్తున్న మార్పులకు సంగమం వద్ద లోతు అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది.

**కెరటాల ఉధృతి**

రాజోలు దీవిలోని ఇతర సముద్ర తీర ప్రాంతాలకు భిన్నంగా అంతర్వేది వద్ద తీరం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే సముద్రం అలజడిగా ఉంటుంది. కానీ అంతర్వేది వద్ద మాత్రం ప్రకృతి వైపరీత్యాలతో పాటు, అమావాస్య, పౌర్ణమి ఘడియలకు ఉధృతంగా కనిపిస్తుంది. ఈ కెరటాల ఉధృతికి సంగమం వద్ద గోదావరిపై కూడా తీవ్ర ప్రభావం చూపడంతో కోత పెరుగుతోంది.

**పొంచిఉన్న ప్రమాదం**

అంతర్వేది సాగర సంగమం వద్ద భౌగోళికంగా ఏర్పడిన మలుపులో సముద్రం వైపు కెరటాల లోతు కంటే ప్రశాంతంగా ఉండే గోదావరి లోతు అత్యంత ప్రమాదకరంగా ఉంది. సంగమం వద్ద సముద్ర కెరటాల్లోకి ప్రమాదవశాత్తూ వెళ్లినా వెనక్కి రావచ్చు గానీ, గోదావరి ఒడ్డున ఒక్క అడుగువేస్తే చాలు ఇక ప్రాణాలు గాలిలో కలిసి పోయే ప్రమాదం పొంచి ఉందని మత్స్యకారులు తెలిపారు. ఇక్కడ అప్రమత్తంగా లేకపోతే అమాంతంగా సుమారు 8 అడుగుల లోతులోకి కూరుకుపోతామన్నారు. సముద్రంలో కంటే వశిష్ట గోదావరి అంచులో భారీగా చోటుచేసుకుంటున్న కోత ఎంతో ప్రమాదకరమని చెబుతున్నారు.

**టెట్రాపోడ్స్ ఏర్పాటు చేయాలి**

సాగర సంగమం వద్ద తీర రక్షణ వలయంగా టెట్రాపోడ్స్ (నాలుగు కాళ్లు ఉన్నట్టుగా కనిపించే ప్రత్యేక దిమ్మలు) ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా సముద్ర తీర ప్రాంతాల్లో రక్షణకు, కోత నివారణకు వీటిని ఏర్పాటు చేస్తుంటారు. తీరంలో అలల శక్తిని విచ్ఛిన్నం చేసి, అలల తీవ్రతను ఇవి తగ్గిస్తాయి. అలాగే అలలు నేరుగా తీరాన్ని తాకకుండా చేసి, తీర రక్షణ గోడలుగా పనిచేస్తాయి. వీటి ప్రత్యేక ఆకారం వల్ల ఒకదానిపై ఒకటి బలంగా నిలబడి చలనం చెందకుండా ఉంటాయి. తుపానులు, భారీ అలలు వచ్చినప్పుడు కూడా స్థిరంగా నిలబడతాయి. పోర్టులు, హార్బర్లు, లైట్‌హౌస్‌లు, తీర ప్రాంతాల రక్షణకు ఉపయోగపడతాయి. సాధారణంగా వీటిని కాంక్రీట్‌తో తయారు చేస్తారు. దీర్ఘకాలంగా మన్నికగా కూడా ఉంటాయి.

## కాంగ్రెస్ మోసాలకు విసిగి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



**జైనూర్ :** అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చిన తరువాత మరోమాటతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై విసిగి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం కాలేజీగూడాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఉపసర్పంచులతో పాటు మరో 70 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతో ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రావుజీగూడ ఉప సర్పంచ్ పెందూర్ గంగామణి, పవర్ గూడా ఉపసర్పంచ్ కరాడ్ లక్ష్మింభాయి, వార్డు మెంబర్లు, నసు, ఇసాక్, జమీర్, దినేష్ బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మరుస్కోల సరస్వతి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్ రావు, మాజీ సహకార సంఘం చైర్మన్ హన్ను పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, సర్పంచులు కొడప ప్రకాష్, మాడవి కౌసల్య, మాజీ సర్పంచ్ మాడవి, మాజీ ఎంపీటీసీ కుమ్ర భగవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలు తీర్చాలని ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన



**నార్నూర్ :** గ్రామంలో తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బేతాల్ గూడ, సోనాపూర్ గిరిజనులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గ్రామంలో 140 కుటుంబాలుండగా 7 వందల మంది జనాభా నివాసం ఉంటుందని గ్రామస్థులు వివరించారు. తాగు నీటి కోసం మిషన్ భగీరథ ద్వారా రెండు నీటి ట్యాంకులు, ఇంటింటా పైపులు, ట్యాపులు ఏర్పాటు చేసినా నేటికీ మిషన్ భాగీరథ( వీఱంంఱశీఅ దీష్ట్రుస్త్రఱతీష్ట్రు) నీరు అందకపోవడం విచారకరమని అన్నారు. బేతాల్ గూడలో ఒక చేతిపంపు, సోనాపూర్‌లో ఒక్క చేతి పంపు ఉంది. నీళ్ల కోసం ఈ చేతి పంపుల వద్ద స్థానికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. 40 ఏళ్ల క్రితం తాగునీటి కోసం వ్యవసాయ బావి నుంచి ఉన్న పైప్ లైన్‌కు మరమ్మతులు చేయడానికి పంచాయతీ వద్ద నిధులు లేకపోవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. నీటి కష్టాలు తట్టుకోలేక బుధవారం గిరిజనులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జాదవ్ పరమేశ్వర్ అక్కడికి చేరుకుని స్థానికులను సముదాయించారు. నీటి సమస్యని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.

## గోదావరిఖనిలో కోలిండియా పోటీలకు వెళ్తున్న కళాకారులకు ఆత్మీయ వీడ్కోలు



**కోల్ :** ఈనెల 15 నుంచి నాగపూర్ లో జరగనున్న కోలిండియా సాంస్కృతిక పోటీలకు ఎంపికై బయలుదేరి వెళ్తున్న రామగుండం రీజియన్ కళాకారులకు బుధవారం గోదావరిఖనిలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఇటీవల మందమర్రిలో జరిగిన కంపెనీ స్థాయి సాంస్కృతిక పోటీల్లో లైట్ సాంగ్ విభాగంలో దార సుశీల, మౌతర్గన్ విభాగంలో ఆదిల్ మొహమ్మద్, కవాలి టీం విభాగంలో సాన జలపతి, పులియాల సతీశ్, పొన్నాల శంకర్, శ్యామ్, కనకం రమణయ్య, రాకేశ్, ప్రేమ్ కుమార్ లు ప్రథమ బహుమతులు సాధించి కోలిండియా పోటీలకు ఎంపికైన విషయం విధితమే. ఈమేరకు బుధవారం నాగపూర్ కు బయలుదేరి వెళ్తున్న కళాకారులను సీనియర్ కళాకారులు స్థానిక సీఈఆర్ క్లబ్ లో శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కోలిండియా స్థాయి పోటీల్లో రాణించి సింగరేణి సంస్థకు, ఈ ప్రాంతంకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాకారులకు ప్రోత్సాహమే విజయం వైపు నడిపిస్తుందన్నారు. అలాగే ఇటీవల మంచిర్యాలలో జరిగిన లఘుచిత్ర పోటీల్లో జ్యూరీ బహుమతి సాధించిన 'అలా వృద్ధాశ్రమం లో" లఘుచిత్ర నిర్మాత సతీశ్ కుమార్, దర్శకుడు చంద్రపాల్ చేతుల మీదుగా అవార్డును, మెమెంటోను అందజేశారు. సీనియర్ కళాకారులు కవ్వంపల్లి స్వామి, ఏరియా సూపర్వైజర్ హనుమాన్ దాస్ రమేష్, కాసిపాక రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశమే హద్దుగా సిరిసిల్లలో కైట్ ఫెస్టివల్.. భారీగా తరలివచ్చిన చిన్నారులు, యువత



**సిరిసిల్ల :** కార్మికక్షేత్రమైన సిరిసిల్ల లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంక్రాంతి పండుగ కు నూతన శోభను తెచ్చేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక బతుకమ్మ ఘాట్ వేదికగా ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి అద్భుతమైన ఆదరణ వచ్చింది. పెద్ద సంఖ్యలో చిన్నారులు, యువకులు తరలివచ్చారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నవారికి పతంగులు, ధారాలను అందజేసి ప్రోత్సహించారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ , ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. అదే విధంగా సోమ, మంగళ వారాలలో వాడవాడలా నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుండి విశేష స్పందన లభించింది. దాదాపు 5వేల మందికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ జిందం కళ, సెస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, సత్తార్, దార్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### 44.89 లక్షల పీవీల టోకు విక్రయాలు



వాహన కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహ న (పీవీ–కార్లు, జీపులు, వ్యాన్లు) సరఫరాలు 2025 లో 44,89, 717కు చేరా యని తయారీదార్ల సమాఖ్య సియామ్ మంగళవారం వెల్లడించింది. 2024లో సరఫరా అయిన 42,74, 793 వాహనాల కంటే ఇవి 5% ఎక్కువ. జీఎస్టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్‌లో బలమైన అమ్మకాల వల్ల, ఒక క్యాలెండర్ ఏడాదిలో 2025 రికార్డు సృష్టించిందని పేర్కొంది. 'భారతీయ వాహన పరిశ్రమకు గత ఏడాది మైలురాయిగా నిలిచింది. తొలి అర్ధ భాగంలో స్తబ్దుగా కనిపించిన పరిశ్రమ, సరఫరా సవాళ్లను ఎదుర్కొంది. ఆదాయపు పన్ను ఉపశమనం, రెపో రేటు కోతలు, జీఎస్టీ 2.0 వంటి బహుళ నిర్మాణాత్మక సంస్కరణలతో .. వాహనాలకు సానుకూల గిరాకీ వాతావరణం ఏర్పడింద'ని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వెల్లడించారు. స్థిరమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, అందుబాటు ధరలు, విధాన మద్దతుతో 2026లో కూడా పరిశ్రమ సానుకూల ధోరణిలో పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు.

### వినియోగదారులకు క్షమాపణలు తెలిపిన నెస్లె సిఇఒ



30కి పైగా దేశాలు కొన్ని బ్యాచ్‌ల శిశు పోషకాహార ఉత్పత్తులను వెనక్కిపంపడంపై నెస్లె సిఇఒ పిలిప్ నవ్రాటిల్ వినియోగదారులకు క్షమాపణలు తెలిపారు. పరిస్థితిని వివరించే ముందు, తల్లిదండ్రులు, శిశు సంరక్షకులు మరియు వినియోగదారులకు కలిగించిన ఆందోళన, అంతరాయానికి క్షమాపణలు కోరుతున్నాను అని కంపెనీ వీడియోలో నవ్రాటిల్ పేర్కొన్నారు. వెనక్కి పంపిన ఉత్పత్తులను ఇప్పుడు ప్రకటించనున్నట్లు తెలిపారు. వాంతులు, వికారానికి కారణమయ్యే విషపూరిత రసాయనాలు ఉన్నందున శిశు ఉత్పత్తులను పలు యూరోపియన్ యూనియన్ దేశాలు, ఆస్ట్రేలియా,బ్రెజిల్, చైనా, మెక్సికో మరియు దక్షిణాఫ్రికా సహా సుమారు 37 దేశాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా వెనక్కి పంపిన ఉత్తత్తులను భారతదేశంలో దిగుమతి చేసుకోవడం లేదా విక్రయించడం లేదని నెస్లె స్పష్టం చేసింది. ప్రతి ఉత్పత్తిని స్థానికంగా తయారు చేస్తామని పేర్కొంది

### రష్యా ఇంధన దిగుమతుల్లో మూడో స్థానానికి భారత్

రష్యా నుంచి శిలాజ ఇంధనాల కొనుగోలుదార్లలో భారత్ మూడో స్థానానికి పరిమితమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ప్రభుత్వ చమురు రిఫైనరీలు, రష్యా నుంచి దిగుమతులు తగ్గించడం ఇందుకు నేపథ్యమని మేధో సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్(సీఆర్ఈఏ) పేర్కొంది. డిసెంబరులో భారత్ మొత్తం మీద 2.3 బిలియన్ యూరోల (సుమారు రూ.24,150 కోట్లు) విలువైన ముడిచమురు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. నవంబరు దిగుమతులు 3.3 బి. యూరోలు కావడం గమనార్హం. 2.6 బి. యూరోల విలువైన రష్యా ముడిచమురు కొనుగోళ్లతో, తుర్కియే రెండో స్థానాన్ని భర్తీ చేసింది. రష్యా చమురు కొనుగోలులో చైనా అగ్రగామిగా కొనసాగుతోంది. రష్యా అగ్రగామి 5 సంస్థలకు వచ్చిన ఎగుమతి ఆదాయాల్లో, చైనా వాటా 48% (6 బిలియన్ యూరోలు) కావడం గమనార్హం. రష్యా నుంచి భారత్ కొనుగోళ్లలో చమురు వాటా 78 శాతంగా ఉంటోంది. దీని విలువ 1.8 బి. యూరోలు(దాదాపు రూ.18,900 కోట్లు). తర్వాతి స్థానాల్లో బొగ్గు(424 మి. యూరోలు), చమురు ఉత్పత్తులు (82 మి. యూరోలు) ఉన్నాయి.

# రూ. 4 లక్షల కోట్లకు దేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు



2025లో మనదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్ల మార్కును దాటాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం తెలిపారు.ఈ ఏడాది నాలుగు సెమీకండక్టర్ తయారీ ప్లాంట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా ఇవి మరింత పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో దీని గురించి పోస్ట్ చేసిన మంత్రి, ఎగుమతులు పెరగడంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలను సృష్టి జరిగిందని, విదేశీ మారక ద్రవ్య ఆదాయాన్ని పెంచిందని అన్నారు. 2025లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు దాటాయి. ఉద్యోగాలను, విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకువచ్చాయి. నాలుగు సెమీకండక్టర్ ప్లాంట్లు వాణిజ్య ఉత్పత్తిలోకి రావడంతో 2026లో కూడా ఇదే ఊపు కొనసాగుతుందని వెల్లడించారు. అధికారిక అంచనాల ప్రకారం, 2024–25లో దాదాపు రూ.11.3 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి జరిగింది. ఇందులో ఎగుమతుల విలువ దాదాపు రూ.3.3 లక్షల కోట్లుగా ఉంది. ఈ రంగం ప్రస్తుతం 25 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో ఎక్కువ భాగం మొబైల్ ఫోన్లే ఉన్నాయని పరిశ్రమ వర్గాలు పేరొన్నాయి. గతేడాది మన్దేశం నుంచి ఐఫోన్ ఎగుమతులు రూ. 2.03 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఇది అంతకుముందు 2024లో నమోదైన రూ. 1.1 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు అని మంత్రి పోస్ట్‌లో పేర్కొన్నారు. భారత సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో మొబైల్ ఫోన్ ఉత్పత్తి 75 బిలియన్ డాలర్ల(రూ. 6.77 లక్షల కోట్ల)కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తన నివేదికలో ప్రస్తావించింది. వీటిలో 30 బిలియన్ డాలర్ల(రూ. 2.70 లక్షల కోట్ల) ఎగుమతులు ఉన్నాయి.

## భారత జీడీపీ వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేసిన ప్రపంచ బ్యాంకు




వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో అంచనా వేసిన 6.3 శాతంగా అంచనా వేసింది. ప్రస్తుతం దీన్ని 6.5 శాతానికి సవరిస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు మంగళవారం ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును కొనసాగిస్తుంది. అమెరికాకు పంపే కొన్ని ఎగుమతులపై అధిక సుంకాలు ఉన్నప్పటికీ, ఇది భారత వస్తువుల ఎగుమతుల్లో దాదాపు 12 శాతం వాటాయే ఉంది. ప్రధానంగా దేశీయ డిమాండ్‌లో బలమైన ఊపు, గతంలో ఊహించిన దానికంటే అధిక స్థిరమైన ఎగుమతుల ద్వారా ప్రతికూల ప్రభావాలను భారత్ అధిగమిస్తుందని ప్రపంచ బ్యాంకు తన తాజా గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గితే భారత వృద్ధి అంచనా మరింత మెరుగుపడుతుందని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. కొన్ని వాణిజ్య సమస్యలకు పరిష్కారం లభించడం, అమెరికా సుంకాలను పాక్షికంగా ఉపసంహరించుకుంటే, భారత ఎగుమతులు ఊహించిన దానికంటే వేగంగా పెరగవచ్చు. వాణిజ్య అడ్డంకులను తగ్గించడానికి దేశాల మధ్య చర్చలు మరింత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూడా సహాయపడతాయి. తద్వారా వ్యాపార, వినియోగదారుల విశ్వాసం పెరుగుతుంది, దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో అధిక వ్యయం, అధిక పెట్టుబడులకు ఆస్కారం ఉంటుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది.

## స్పోర్ట్స్

# కేఎల్ రాహుల్ సెంచరీ..




రాజ్‌కోట్ వేదికగా న్యూజిలాండ్‌తో జరగుతున్న రెండో వన్డేలో టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. 120 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును రాహుల్ తన సెంచరీతో ఆదుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ శుభారంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ 70 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రోహిత్(24) ఔటయ్యాక గిల్(56), శ్రేయస్ అయ్యర్(8), విరాట్ కోహ్లి(23) వెంటవెంటనే పెవిలియన్‌కు చేరారు. ఈ క్రమంలో రాహుల్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(27)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. జడేజా ఔటైనప్పటికి రాహుల్ మాత్రం తన ఏకాగ్రతను కోల్పోలేదు. ఆచితూచి ఆడుతూ 87 బంతుల్లో తన ఎనిమిదివ వన్డే సెంచరీ మార్క్‌ను కేఎల్ అందుకున్నాడు. ఫలితంగా భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. మొత్తంగా రాహుల్ 92 బంతులు ఎదుర్కొని 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 112 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టేన్ క్లార్క్ మూడు వికెట్లు పడగొట్టగా.. జేమీసన్, పౌల్క్స్, బ్రెస్‌వెల్ తలా వికెట్ సాధించారు.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్.. టాప్ ప్లేస్‌లో కోహ్లీ



**దుబాయ్:** ఇండియన్ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(ఎఱతీఫ్ ఖశీష్త్రశ్రీఱ).. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్ కొట్టేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో హాఫ్ సెంచరీ చేసిన కోహ్లీ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. 37 ఏళ్ల కోహ్లీ .. 2021 జూలై తర్వాత మళ్లీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలి స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ వర్మ వన్డే బ్యాటింగ్‌లో మూడవ స్థానానికి పడిపోయాడు. కోహ్లీ ఫస్ట్ వన్డేలో కివీస్‌పై 93 రన్స్ స్కోరు చేశాడు. దీంతో అతను వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఫస్ట్ లో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. కోహ్లీ తన చివరి అయిదు ఇన్నింగ్స్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 74, 135, 102 స్కోర్ చేశాడు. ఇక సఫారీలతో ఓ మ్యాచ్‌లో 65, కివీస్‌తో ఫస్ట్ మ్యాచ్‌లో 93 స్కోరు చేశాడు. అక్టోబర్ 2013లో కోహ్లీ తొలిసారి వన్డే ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానంలో నిలిచాడు. ఇక ఆ పొజిషన్‌లో మొత్తం 11 సార్లు అతను టాప్ ప్లేస్‌లో నిలిచాడు. కోహ్లీ తన కెరీర్‌లో 825 రోజుల పాటు వన్డే టాప్ బ్యాటర్‌గా నిలిచాడు. శుభమన్ గిల్ అయిదవ స్థానంలో, శ్రేయాస్ అయ్యర్ టాప్ 10లో ఉన్నాడు.

# పాకిస్థాన్‌తో మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్న ఆస్ట్రేలియా



**లాహోర్:** వచ్చే నెలలో ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ భారత్, శ్రీలంక వేదికగా జరనున్నది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్(ాూఖజాూఖా)లో పర్యటించనున్నది. వరల్డ్‌కప్ ప్రిపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌తో మూడు టీ20 మ్యాచ్‌లను ఆస్ట్రేలియా ఆడనున్నది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జనవరి 29, 31, ఫిబ్రవరి ఒకటో తేదీన ఆ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అయితే ఆస్ట్రేలియా తన వరల్డ్‌కప్ మ్యాచ్‌లను ఇండియాలో ఆడనున్నది. ఇక పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగా ఆడనున్నది. ఏప్రిల్ 2022లో చివరిసారి ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌లో పర్యటించింది. జనవరి 28వ తేదీన ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌కు చేరుకోనున్నది. గత ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో కొన్ని మ్యాచ్‌లను పాకిస్థాన్ వేదికగా ఆస్ట్రేలియా ఆడింది. ఆసీస్‌తో జరిగే సిరీస్‌కు చెందిన జట్టును పాకిస్థాన్ త్వరలో ప్రకటించనున్నది. పాక్ కోచ్ మైక్ హెస్సాన్, కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా ఈ అంశంపై భేటీకానున్నారు.

ధర్మఘంట



# లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో అల్లు అర్జున్?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్ ఇండియా చిత్రం రాబోతుందని వార్తలు వైరలవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తుండగా.. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి నేడు చిత్రయూనిట్ అప్‌డేట్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించబోతున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ కెరీర్‌లో 23వ చిత్రంగా ఈ సినిమా రాబోతుండగా.. అప్‌డేట్ ఎప్పుడూ వస్తుందా అని అభిమానులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో వచ్చిన 'పుష్ప' సిరీస్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో, ఈ కొత్త కాంబినేషన్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్ సినిమాలకు ఉండే ప్రత్యేకమైన 'హజఖ' (లోకేష్ సినిమాటిక్ యూనివర్స్) క్రేజ్ దృష్ట్యా, అల్లు అర్జున్ సినిమా కూడా అందులో భాగమవుతుందా లేదా అనేది అభిమానుల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ చిత్రానికి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించబోతున్నట్లు సమాచారం. దీనిపై మరికొన్ని గంటల్లో క్లారిటీ రాబోతుంది. సినిమాల విషయానికి వస్తే అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ మూవీ చేస్తున్నారు. ఆ సినిమా పనులన్నీ పూర్తయిన తర్వాత, 2026 జూన్ లేదా జూలై నెలలో లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్లే అవకాశం ఉంది. ఈ సినిమా కోసం లోకేష్ కనగరాజ్ దాదాపు రూ.75 కోట్ల మేర భారీ పారితోషికాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తుంది. ఇది కేవలం యాక్షన్ డ్రామా మాత్రమే కాకుండా ఒక సరికొత్త కాన్సెప్ట్‌తో కూడిన హై-వోల్టేజ్ ఎంటర్‌టైనర్ అని ఇందులో బన్నీ మేకోవర్ మునుపెన్నడూ చూడని విధంగా ఉంటుందని తెలుస్తోంది.

# ఒక్క సీన్‌తో వైరల్.. 'టాక్సిక్' బ్యూటీ ఇన్‌స్టా డిలీట్




కన్నడ స్టార్ హీరో యశ్ కొత్త సినిమా టాక్సిక్ టీజర్ పాన్ ఇండియా రేంజ్‌లో హీట్ పెంచుతుంది. టీజర్‌లో ఉన్న ఇంటిమేట్ సీన్‌పై మహిళా సంఘాలు తీవ్రమైన అభ్యంతరం తెలిపాయి. యశ్‌తో పాటు బోల్డ్ సీన్‌లో కనిపించిన బీట్రీజ్ టోఫెన్ బాఖ్ (దీమ్ఫ్‌తీఱఓ ఖుబటవఅఖుఎష్ట్ర) తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించింది. తన ఇంటిమేట్ సీన్స్‌పై వివాదాలు రావడం వల్లనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీని దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. టాక్సిక్ టీజర్‌లో చాలా బోల్డ్‌గా నటించిన తర్వాత ఆమె గురించి తెలుసుకోవాలని నెటిజన్లు పోటీపడ్డారు. ఈ క్రమంలో దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఆమె వివరాలు షేర్ చేశారు. దీంతో ఆమె పేరు బీట్రీజ్ బాఖ్ అని పంచుకున్నారు. హాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు ఇదే ఫస్ట్ ఇండియన్ సినిమా... దీంతో ఆమెకు భారీగా ఫాలోవర్స్ పెరిగారు. జనవరి 13 వరకు ఆమె ఖాతా యాక్టివ్‌గానే ఉంది. కానీ, సెడెన్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా కనిపించకపోవడంతో నెటిజన్లు ఈ విషయాన్ని షేర్ చేస్తున్నారు.

# ఓటీటీలోకి వచ్చేసిన 'దండోరా'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే.!



తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం నేటి నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు. దీంతో తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని కొడుకు విష్ణు (నందు), కూతురు సుజాత (మనికా చిక్కాల), ఊరి సర్పంచ్ (నవదీప్) కలిసి పోరాటం మొదలుపెడతారు. అయితే సొంత కులమే శివాజీని ఎందుకు వెలివేసింది? తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు, ఈ కుల రాజకీయాలకు సంబంధం ఏంటి? వేశ్య శ్రీలత (బిందుమాధవి) పాత్ర శివాజీ జీవితాన్ని ఎలా మార్చింది? చివరికి శివాజీ అంత్యక్రియలు సజావుగా సాగాయా లేదా? అనేదే మిగతా కథ.




# 'బాహుబలి 2' రికార్డు బద్దలు.. నార్త్ అమెరికాలో 'ధురంధర్' సరికొత్త చరిత్ర!

బాలీవుడ్ సినిమా ధురంధర్ విడుదలై నెల దాటుతున్న ఇంకా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం తాజాగా మరో రికార్డును అందుకుంది. గత 9 ఏండ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఎస్.ఎస్. రాజమౌళి 'బాహుబలి 2' రికార్డును ధురంధర్ తాజాగా అధిగమించింది. నార్త్ అమెరికాలో ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 20.7 మిలియన్ డాలర్లతో 'బాహుబలి 2' అగ్రస్థానంలో ఉండగా.. ఇప్పుడు 'ధురంధర్' 21 మిలియన్ డాలర్ల మార్కును దాటి అగ్రపీఠాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో కల్కి 2898 ఏడీ (18.5మి), పఠాన్ (17.5మి), జవాన్ (15.6మి) వంటి భారీ చిత్రాలను ఇది వెనక్కి నెట్టింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సినిమాల సందడి నెలకొన్నప్పటికీ, ఉత్తరాదిలో ఈ సినిమా ప్రభంజనం ఏమాత్రం తగ్గలేదు. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఇప్పటివరకు రూ. 863 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఐదు రోజుల్లోనే దాదాపు రూ. 22 కోట్లకు పైగా వసూళ్లు రావడం ఈ సినిమా సత్తాను చాటుతోంది. సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్ వంటి హేమాహేమీలు నటించిన ఈ చిత్రం అటు ఆస్ట్రేలియా మార్కెట్‌లోనూ సత్తా చాటుతోంది. వచ్చే వారం 'బోర్డర్ 2' విడుదలయ్యే వరకు ఈ జోరు ఇలాగే కొనసాగే అవకాశం కనిపిస్తోంది.



# బాలీవుడ్ పీఆర్ కల్చర్‌పై తాప్సీ ఆసక్తికర వ్యాఖ్యలు

"హిందీ చిత్ర పరిశ్రమలో ప్రతి దానికీ డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. గత రెండేళ్లలో బాలీవుడ్‌లో పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) వ్యూహాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు పీఆర్ అంటే మన గురించి, మన సినిమాల గురించి మంచి మాటలు ప్రచారం చేయడం. ఇప్పుడు ప్రమోషన్ అనేది ఇతరులను తక్కువగా చూపించే స్థాయికి వెళ్లింది. ఇతరులను కిందికి లాగడానికి కూడా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. మన ప్రతిభను కూడా డబ్బుతోనే ముడిపెడుతున్నారు" అని హీరోయిన్ తాప్సీ పేర్కొన్నారు. ఏ విషయం గురించి అయినా నిర్మొహమాటంగా మాట్లాడే తాప్సీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పీఆర్ వ్యవస్థ గురించి మాట్లాడారు. "నేను నా పనులతో చాలా బిజీగా ఉన్నాను. రెండేళ్లుగా వర్క్‌లో స్పీడ్ తగ్గించాను. ఏడాదిన్నర నుంచి ఇండస్ట్రీలోని పీఆర్ వ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి. ఇక్కడ ప్రతి దానికి డబ్బు చెల్లించాలని గ్రహించాను. ప్రతిభను కూడా డబ్బుతోనే ముడిపెడతారు. మీ విజయం వేరొకరి వైఫల్యంపై ఆధారపడి ఉంటుందనేలా కొత్త వెర్షన్స్ సృష్టించారు. కానీ, నా మనస్తత్వం పూర్తి భిన్నమైనది. మన పనే మన గురించి చెప్పాలనుకుంటాను. అందుకే ఇలాంటి వాటి కోసం డబ్బులు ఖర్చు చేయను. నా ప్రయాణాలు, నా కోసం, నా కుటుంబంపై, నాకు దగ్గరైన వాళ్లపై ఖర్చు చేయడానికే ఇష్టపడతాను. నన్ను ప్రశంసిస్తూ ఆర్టికల్స్ రాయడానికి, నన్ను పొగడడం కోసం మాత్రమే సోషల్ మీడియా ఖాతాలకు వేలల్లో చెల్లించడానికి

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# చెలిమికి స్నేహంతో సంక్రాంతి... మన పొంగలి సంప్రదాయ ఆచారాలు

సంక్రాంతి అంటే మన తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేకమైన పండుగగా ప్రసిద్ధిగాంచింది. ఈ పండుగ గురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం ఏమి లేదు. అయినా దీని గురించి పాటించవలసిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. శుభ్రత,కొత్త పంట,పెద్దల గౌరవం ప్రాముఖ్యతగా చెప్పే భోగి, పొంగలి,కనుమ వేడుకలు తెలుగు ప్రజలు మరియు దక్షిణ భారతీయులు అత్యంత పురాతన మరియు ముఖ్యమైన సంప్రదాయాలు ఈ పొంగలి వేడుకలు. తమిళ క్యాలెండర్లో మార్గశిర నెలలో ఆఖరి రోజు నుంచి మొదలై, పంట చేతికొచ్చిన తర్వాత జరుపుకునే పండుగ సంక్రాంతి. పండుగ నాడు తన ధాన్య సిరి చూసి రైతు మురిసిపోతూ సంతోషంగా తన కుటుంబంతో జరుపుకునేదే సంక్రాంతి పండుగ. అన్నం పెట్టి రైతు సంతోషంగా ఉంటేనే దేశం కూడా సంతోషంగా ఉంటుంది. దేశ ప్రజల సంతోషాన్ని తమ సంతోషంగా భావిస్తూ అందరు కలిసి జరుపుకునే పండుగనే సంక్రాంతి. ముగ్గుల వాకిలలో,కొత్త రుచులతో గుమగుమలాడే లోగిలిలో,మంకర రాశి వెలుగుల్లో,ఎగిరే పతంగుల సంతోషాల్లో తేలిపోయే సంబరమే సంక్రాంతి పండుగ. ఇటీవల వాడుకలోకి తెచ్చిన సంక్రాంతి అనే సంస్కృత పదం మన తెలుగు పొంగలి అనే పదం రెండు వేరువేరు అర్ధాన్ని స్ఫూర్తిస్తాయని సంక్రాంతి అర్థం. సూర్యుడు ఒక కిలో నుండి వెళ్లడం సంవత్సరంలో 12 సంక్రాంతిలు వస్తాయి. మన పొంగలి లేదా పొంగల్ అర్థం కొత్త పంట పొంగడం. పొంగలి రోజు కొత్త పంట యొక్క మొదటి బియ్యం కొత్తకుండలో వేడి చేసి పొంగేటట్టు వేస్తారు. మనకు కావలసిన దాని కన్నా మిగులు ఉండాలని అశిస్తారు. పశువులని కూడా పండుగలో భాగస్వామ్యం చేసి పూజిస్తూ,ఈ రోజు పశు వులకు సెలవు అనుమతిస్తారు. ఎద్దు కొమ్ములకు ఆకర్షణీయమైన రంగులు రుద్దడమే కాకుండా అందమైన బట్టలు కప్పుతారు. పూర్వకాలంలో ఇళ్ళకి వేల్లబోసి పూర్తిగా శుభ్రం చేయించుకునేవారు. ఈ పండుగ మూడు రోజులు జరుపుకుంటారు. మొదటిరోజు భోగీ మంటలు వేసి వ్యర్థమైన గృహవస్తువులను పారేస్తారు. రెండోరోజు పొంగలి,బియ్యం పొంగిస్తారు మరియు అదనంగా కనుకు రోజున పిల్లలు పెద్దలు దీవెనలు కోరుకుంటారు. ఈ వేడుకలలో కోడి,మేక, తదితర మాంసాహారం వండుకుంటారు.

ప్రాచీన సంప్రదాయాలు మరియు చరిత్ర

ప్రాచీన గ్రంథాలు మరియు చారిత్రక ఆధారాల ప్రకారం సంక్రాంతి లేదా పొంగలి పండుగకు ఉన్న మరికొన్ని విశిష్టమైన పేర్లతో పిలుచుకునేవారు.

ఉత్తరాయణం

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తర దిశగా ప్రయాణాన్ని ప్రారంభించే సమయాన్ని ప్రాచీన కాలం నుండి 'ఉత్తరాయణం'అని పిలుస్తారు. ఇది దేవతల పగలుగా భావించబడుతుంది.

మాఘ మేళా

సుమారు 2,000 సంవత్సరాల క్రితమే మహాభారతంలో ఈ పండుగను 'మాఘ మేళా'గా పేర్కొన్నారు. పవిత్ర నదులలో స్నానం ఆచరించడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

తిరుప్పావై/మార్గళి నోంబు

9వ శతాబ్దపు తమిళ గ్రంథాల ప్రకారం,ప్రాచీన కాలంలో దీనిని 'పావై నోంబు' లేదా 'మార్గళి వ్రతం' అని పిలిచేవారు.

పోనకం/తిరుపోనకం

చోళులు మరియు విజయనగర రాజుల కాలం నాటి శాసనాల్లో 'పొంగలి' వంటకాన్ని 'పోనకం' లేదా 'తిరుపోనకం' అని వ్యవహరించేవారు.

పుత్తీడు

చోళుల కాలంలో కొత్త బియ్యంతో వంట చేసి జరుపుకునే ఈ పంట పండుగను 'పుత్తీడు' అని కూడా పిలిచేవారని చారిత్రక ఆధారాలు ప్రకారం తెలుసుకోవచ్చు.



తెలుగు సంప్రదాయాలు

మకర సంక్రాంతి అంటే కేవలం పండగ మాత్రమే కాదు. ప్రకృతిలో వచ్చే మార్పుకు సూచన.

సూర్యుడి ఉత్తరాయణ ప్రయాణం

పురాణాల ప్రకారం,సూర్య భగవానుడు ఈ రోజున తన కుమారుడైన శని దేవుడిని కలవడానికి వెళ్తాడు. సాధారణంగా తండ్రీకొడుకులకు పడకపోయినా,ఈ రోజున వారిద్దరూ కలిసి ఉంటారు. కాబట్టి ఇది బంధాల కలయికకు ప్రతీక. అలాగే ఈ రోజుతో సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించి, ఉత్తరాయణ పుణ్యకాలాన్ని ప్రారంభిస్తాడు.

భీష్మ పితామహుడి మోక్షం

మహాభారతంలో కురువృద్ధుడు భీష్ముడు అంపశయ్యపై ఉండి, ప్రాణాలు వదలడానికి ఈ ఉత్తరాయణ పుణ్యకాలం కోసమే వేచి చూశాడు. ఈ రోజున ప్రాణాలు వదిలితే పునర్జన్మ లేకుండా మోక్షం లభిస్తుందని నమ్మకం.

పండుగ రోజులు – విశేషాలు

భోగి:పాత ఆలోచనలను పనికిరాని వస్తువులను భోగి మంటల్లో వేసి కాల్చేస్తాం. కొత్త జీవితానికి నాంది పలుకుతాం. సంక్రాంతి: ఇది ప్రధాన పండుగ. కొత్త బియ్యం,బెల్లంతో పొంగలి చేసి సూర్యుడికి నివేదిస్తాం. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలతో వీధులన్నీ కళకళలాడుతాయి.

కనుమ:వ్యవసాయంలో మనకు తోడుగా ఉన్న పశు వులను పూజించే రోజు. రైతులు తమ కృతజ్ఞతను చాటుకుంటారు.

సంప్రదాయ పద్ధతులు

ముగ్గులు (రంగవల్లికలు):

సంక్రాంతి అంటేనే ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు. గొబ్బెమ్మలు:

ముగ్గుల మధ్యలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచి,వాటిని పూలతో అలంకరిస్తారు. ఇవి లక్ష్మీదేవికి ప్రతిరూపాలుగా భావిస్తారు. డిజైన్లు:

చుక్కల ముగ్గులు,రథం ముగ్గులు ఈ పండుగ ప్రత్యేకత. సంక్రాంతి రోజున వేసే రథం ముగ్గు సూర్యుడి ప్రయాణానికి సూచన.

గాలిపటాల పండుగ:

గాలిపటాలు ఎగురవేయడం కేవలం వినోదం మాత్రమే కాదు,దీని వెనుక ఒక ఆరోగ్య సూత్రం కూడా ఉంది. చలికాలంలో చర్మ వ్యాధులు రాకుండా ఉండేందుకు, ఎండలో నిలబడి గాలిపటాలు ఎగురవేయడం వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్ డి లభిస్తుంది. ఆకాశమంతా రంగురంగుల గాలిపటాలతో నిండిపోవడం ఐక్యతకు ప్రతీక.

హరిదాసులు మరియు గంగిరెద్దులు:

"హరిలో రంగ హరి" అంటూ వచ్చే హరిదాసు అక్షయ పాత్రను తలపై ధరించి వస్తాడు. ఆయనకు బియ్యం దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్మకం. అలంకరించిన గంగిరెద్దులను ఇంటింటికీ తిప్పుతూ,వాటి విన్యాసాలను ప్రదర్శిస్తారు.

సంప్రదాయ వంటలు మరియు రుచులు

అరిసెలు:సంక్రాంతికి ముఖ్యమైన వంటకం ఇది బియ్యప్పిండి,బెల్లం పాకంతో చేసే అరిసెలు మెత్తగా రావాలంటే పాకం పట్టేటప్పుడు కొంచెం నెయ్యి కలిపి చేసే రుచికర వంటకం.

చక్కెర పొంగలి:కొత్త బియ్యం,పాలు,బెల్లం మరియు డ్రై ఫ్రూట్స్‌తో చేసే ఈ ప్రసాదం సూర్య భగవానుడికి చాలా ఇష్టం.

జంతికలు/మురుకులు: కరకరలాడే జంతికల కోసం పిండిలో కొంచెం వెన్న లేదా వేడి నూనె వేసి చేసే వంటక రుచి.

కోడి పందాలు

సంక్రాంతి పండుగలో ఇవన్నీ ఒకటి అయితే తెలుగు రాష్ట్రాలలో మాత్రం కోడి పందాలు అంటే ఇగ చెప్పనక్కర లేదు. ఉద్యోగ రీత్యా,వ్యాపారాల రీత్యా ఎక్కర స్థిరపడ్డ కానీ,ఈ పండుగకు వచ్చి కోడి పందాల ఆటలో భాగస్వామ్యులు అవ్వడం మరియు అక్కడ చూస్తూ సంతోషంగా గడపడం ముఖ్యమైన భాగం. ఈ వేడుకలు తెలుగుజాతి వేల సంవత్సరాల వాటి చారిత్రాత్మకమైన సంప్రదాయం,మతాలకి అతీతమైనవి అమెరికన్లు జరుపుకునే సంయుక్త పండుగ 'థాంక్స్ గివింగ్" వంటి సంప్రదాయం ఉంటుందని తెలుపుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలు మరియు దక్షిణాది దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ సంక్రాంతి పండుగ శభాకాంక్షలతో....



బత్తుల గణేష్,
జర్నలిస్ట్.

## నిర్మల్‌లో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లు

### పరిశీలించిన మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



**ధర్మఘంట జనవరి 14 నిర్మల్:** జనవరి 16 న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పర్యాటక,సాంస్కృతిక,ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు,ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక,విఐపి గ్యాలరీ,సభకు వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామని,ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల పార్కింగ్ స్థలాలను ఎస్పీ జానకి షర్మిల మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, ఎమ్మెల్యే,డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు,ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ అభిలాష్ అభినవ్,ఎస్పీ జానకి షర్మిల,కాంగ్రెస్ నేతలు ఇంద్రకరణ్ రెడ్డి,వేణుగోపాలా చారి,ఆదిలాబాద్,కుమ్రంభీం– ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్,ఆత్రం సుగుణ, శ్రీహరి రావు,శ్యాంనాయక్,స్థానిక కాంగ్రెస్ నాయకులు,వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## బీసీ కమిటీ హాల్‌ను పంచాయతీ కార్యాలయంగా మార్చొద్దు

### సర్పంచికి బీసీ నాయకుల వినతి



**ధర్మఘంట జనవరి 14 ఆలేరు:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం సాయిగూడెం గ్రామంలోని బీసీ కమిటీ హాల్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయంగా మార్చే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ గ్రామ బీసీ సంఘాల నాయకులు బుధవారం సర్పంచ్ గ్యార కవిత సంపత్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా బీసీ సామాజిక వర్గాల సమావేశాలకు, విద్యార్థుల చదువులకు ఈ కమిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి ఇతర ప్రత్యామ్నాయ స్థలాలు ఉన్నప్పటికీ,ఉద్దేశపూర్వకంగా బీసీల సామాజిక భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని అనుకోవడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల వెనుకబడిన వర్గాల ప్రజలు తమ సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వేదిక లేకుండా పోతుందని,ఇది బీసీల మనోభావాలను దెబ్బతీయడమేనని వారు పేర్కొన్నారు. ఒకవేళ బలవంతంగా భవనాన్ని మార్చాలని చూస్తే గ్రామస్తులందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉదరి రాములు, మాజీ వార్డ్ మెంబర్ చింతకింది మల్లేష్,మైల శ్రీశైలం,లక్ష్మయ్య, పుట్ట పవన్,గంగాధరి సుధీర్ కుమార్,బొడ్డు సత్తయ్య,బండి శ్రీనివాస్,బొడ్డు మహేందర్, బొప్పాపురం వెంకటేష్,మైల ఆంజనేయులు,పిల్లిట్ల శేషాద్రి, పుట్ట సురేష్,భయ్యా వెంకటేష్, మైల నాగరాజ్,ఆలేటి సాగర్, మైల సంపత్,యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ౧౧౧౧బోగి మంటల్లో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు


**అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్**

**మెసపూరిత కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడాలి**

**మాజీ ఎమ్మెల్యే,పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్**



**ధర్మఘంట జనవరి 14 రామగుండం:** కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం అబద్ధాల పార్టీ అని,అబద్ధపు ప్రచారాలతో అమలు కాని హామిలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను అరిగోస పెడుతుందని, మెసపూరిత కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపల్లి జిల్లా రామగుండం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బోగి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు పత్రులను బోగి మంటల్లో వేసి కాల్చుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే ప్రజలను నట్టేటా ముంచారన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతు రాజ్యం తీసుకువచ్చేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతంగానికి కన్నీళ్లే మిగిలాయన్నారు. కేసీఆర్ హాయంలో రైతులకు రైతుబంధు, రైతు బీమా,సకాలంలో ఎరువుల పంపిణీ,24 గంటల ఉచిత కరెంటు అందించి రైతుల కళ్లల్లో అనందం నింపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతు కళ్లల్లో కన్నీరు మాత్రమే మిగిలిందని,రైతులను రోడ్డు మీదకు తీసుకువచ్చిన ఘనత రేవంత్ సర్కార్ కే దక్కుతుందని, యూరియా కోసం రోజుల తరబడి దుకాణాలు ముందు ఎదురుచూడాల్సిన దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చిందన్నారు. రామగుండంలో రెండు సంవత్సరాలుగా కమిషన్లు,కుల్చివేతలతో చిరువ్యాపారులను రోడ్డు మీదకు తీసుకువచ్చారే తప్ప,ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది ఏమి లేదన్నారు. మెసపూరిత కాంగ్రెస్ పార్టీ పాలనను చరమగీతం పాడాలనీ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మఘంట

# అమ్మనాన్న ఫౌండేషన్ సేవలు అభినందనీయం





**– బీఆర్ఎస్ జిల్లా మహిళా నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్**

**ధర్మ ఘంట జనవరి 14, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** తల్లిదండ్రులను దైవంగా భావించి తన భర్త పెరుమాళ్ళ శ్రీనివాస్ అమ్మానాన్న ఫౌండేషన్ స్థాపించి గత పదేళ్ళుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని బీఆర్ఎస్ జిల్లా మహిళా నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని 9వ వార్డులో అమ్మా నాన్న పౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేసి మాట్లాడారు. అమ్మా నాన్న పౌండేషన్ మా ఊపిరి ఉన్నంత వరకు నిర్వహిస్తామని తమవంతుగా పేదలను ఆదుకుంటామన్నారు. చదువు ఎంతో విలువైందని చదివితే ఏదైనా సాధించవచ్చని చెప్పిన కుటుంబం మాదని ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలతో పాటు అందరికి బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల దీవెనలతో వార్డు కౌన్సిలర్ అయితే చాలనుకున్న తాను చైర్పర్సన్ అయ్యానని లక్షన్నర మంది ప్రజలకు సేవ చేసే భాగ్యం మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు శ్రీ గుంటకండ్ల జగదీష్ రెడ్డి తనకు కల్పించారని అన్నారు. నిరుపేద విద్యార్థులను గుర్తించి వారి విద్యకు కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు అమ్మానాన్న పౌండేషన్ తొడ్పడుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు ఉన్న 9వ వార్డులో ఏప్రిల్ 14వరకు డాక్టర్ బి.ఆర్. విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ఆయనను చూసినప్పుడు మనం జీవితంలో ఎలా గెలావాలో స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ముగ్గుల పోటీల న్యాయనిర్ణేతలు శ్రీదేవి, సరస్వతి, లక్ష్మీ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు నాగభూషణం, రాము, దుర్గయ్య, అన్వర్, విజయ్, బొజ్జి సందీప్, బండమీది రజిత, ఉప్పలమ్మలు పాల్గొన్నారు.

# వలపు వల విసిరి ఎర వేస్తున్న దంపతుల భాగోతం బట్టబయలు

**సోషల్ మీడియా వేదికగా బ్లాక్ మెయిల్ చేస్తున్న భార్యాభర్తలు**

**బాధితుని ఫిర్యాదుతో అరెస్ట్ చేసి కటకటాల్లోకి పంపిన పోలీసులు**

**వివరాలు వెల్లడించిన కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి**

**24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు.. అభినందించిన ఏసీపీ విజయ్ కుమార్**




**ధర్మఘంట జనవరి 14 కరీంనగర్ రూరల్:** గత రెండు సంవత్సరాల నుండి కరీంనగర్ రూరల్ మండలంలోని ఆరేపల్లిలో గల శ్రీసాయి నివాస అపార్ట్మెంట్ లోని ఒక ప్లాట్ లో భార్యాభర్తలు కలిసి ఇంస్టాగ్రామ్ లో తమ ఫోటోలను పెడుతూ ఉండగా,కొంతమంది వ్యక్తులు ఆమెను ఇంస్టాగ్రామ్ లో ఫాలో అవుతూ,ఆమె నెంబరు తీసుకొని సంప్రదించగా వారికి వలపు వల విసిరి,డబ్బులు తీసుకొని వస్తేనే శారీరక సుఖం ఇస్తానని తన అడ్రస్ తెలుపగా, కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన బడా వ్యాపారస్తులు మరియు యువకులు దాదాపు 100 మంది వరకు ఆమె ఉంటున్న అపార్ట్మెంట్ కు వచ్చే వారు.ఆమె భర్త అనుమతితో ఆమెతో వారు శారీరకంగా ఉండి డబ్బులు ఇచ్చేవారు.దీనిని ఆసరాగా చేసుకొని వారు సెక్స్ లో పాల్గొన్న సమయంలో నగ్నంగా ఉన్నప్పుడు తన భర్త ఫోన్లో వీడియో రికార్డు చేసేవారు.వారు ఇచ్చిన డబ్బులతో అపార్ట్మెంట్ ఈఎంఐ లోన్ కట్టేవారు మరియు ఒక టాటా కారు కొనుక్కొని దర్జాగా తిరిగేవారు.వారి అపార్ట్మెంట్లో ఏసీలు,సోఫా సెట్లు, విలువైన బెడ్స్ కొనుకున్నారు. అంతటితో ఆగకుండా వారి దగ్గరకు వచ్చిన వారిని మీరు నగ్నంగా ఉన్న వీడియోలు మా దగ్గర ఉన్నవని,వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసేవారు.నగ్నంగా ఉన్న ఫోటోలు బయటపడితే పరువు పోతుందని భావించిన కొంతమంది పలుకుబడి ఉన్న వ్యక్తులు భయపడి వారికి ఇచ్చేవారు.ఒక సంవత్సరం కింద పరిచయమైన కరీంనగర్ కు చెందిన వ్యక్తి వారికి బాగా చనువుగా ఉండి,ఆమె భర్తతో మందు త్రాగుతూ ఆమెతో ఎక్కువసార్లు సెక్స్ లో పాల్గొనగా అతనికి మాయమాటలు చెప్పి, వారి అపార్ట్మెంట్ లోనులు మరియు కారు ఇఎంఐలు అతనితోనే కట్టించేవారు.చివరకు అతని వద్ద డబ్బులు అయిపోయి కొన్ని రోజులు రాకపోగా అతనికి వాట్సాప్ కాల్స్ చేసి నీవు ఎందుకు రావడం లేదని అడిగితే, నా దగ్గర డబ్బులు లేవు ఇక నన్ను మర్చిపోండని చెప్పగా వారిద్దరూ భార్యాభర్తలు ఆ వ్యక్తిని మాకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వు నిన్ను మర్చిపోతామని చెప్పగా,అతడు నా వద్ద డబ్బులు లేవని చెప్పగా అంతటితో ఆగకుండా నీవు 5 లక్షల రూపాయల డబ్బులు ఇవ్వకపోతే నీ వీడియోలు మీ ఇంట్లో వారికి పంపుతామని, అప్పటికీ నీవు ఇవ్వకపోతే నిన్ను ఎలాగైనా చంపుతామని బెదిరించారు.అతడు చంపుతారని భయపడి ఒక లక్ష రూపాయలు ఇస్తానని ఒప్పుకొని, వాటిని తీసుకొని ఒంటరిగా వారి ఇంటికి వెళ్లేందుకు శ్రీపురం కాలనీ బోర్డు వద్ద రాపిడో బుక్ చేయడానికి ఉండగా,అప్పుడే భార్యాభర్తలు వారి కారులో ఆ వ్యక్తి ఇంటికి వెళదామని వస్తుండగా అతడు కనపడేసరికి అతనిని పిలిచి డబ్బులు ఇస్తావా లేదా లేకపోతే నిన్ను ఎలాగైనా చంపుతామని బెదిరించగా, సదరు వ్యక్తి చంపుతారేమోనని భయపడి తన వద్ద ఒక లక్ష రూపాయలు ఉన్నావని వారికి ఇచ్చి మిగతా నాలుగు లక్షలు రెండు రోజుల్లో పంపిస్తామని, ఇంతవరకు దాదాపు మీకు 14 లక్షల రూపాయల వరకు ఇచ్చానని నన్ను ఏమి చేయవద్దని వీడియోలను తీసివేయాలని వేడుకొన్నాడు. వారు 4 లక్షలు ఇవ్వకపోతే తప్పకుండా వీడియోలు బయటపెట్టి నిన్ను ఏదో విధంగా చంపుతామని బెదిరించి వెళ్ళిపోయారు.సదరు వ్యక్తి భయపడుకుంటూ తన బంధువులకు,మిత్రులకు జరిగిన మొత్తం విషయాన్ని చెప్పగా, వారు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయమని చెప్పగా,అతడు మంగళవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి,తాను వారికి ఇచ్చిన డబ్బులు ఫోన్ పే ద్వారా పంపానని చూపించగా,పోలీస్ స్టేషన్ లో భార్యభర్తల ఇద్దరిపై కేసు నమోదు చేసి,ఏసిపి విజయ్ కుమార్ ఆదేశానుసారం సిఐ నిరంజన్ రెడ్డి మరియు ఎస్ఐలు సిబ్బందితో రెండు గ్రూపులుగా ఏర్పడి నేరస్తుల గురించి గాలిస్తుండగా,బుధవారం ఉదయం వారిద్దరు వారి కారు నడుపుకుంటూ వస్తూ టేస్టీ దాబా వద్ద ఆగి ఫోన్ మాట్లాడుతుండగా అనుమానంతో వారిని పట్టుకొని విచారించగా,వారు జరిగిన విషయం మొత్తం చెప్పి నేరాన్ని ఒప్పుకొని,వారు కొన్న కారును, వారు నగ్నంగా ఉన్న వీడియోలు తీసిన మొబైల్ ఫోన్ లను,వారి వద్ద ఉన్న ఫిర్యాదు ఇచ్చిన చెక్కును చూపించగా వాటిని స్వాధీన పరుచుకొని,పీఎస్ కు తీసుకొని వచ్చి,రిమాండ్ నిమిత్తం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా,వారిని 14 రోజుల రిమాండ్ విధించి,జైలుకు తరలించమని ఆదేశాలు ఇవ్వగా, వారిని ఎస్కార్టులుగా తీసుకొని జైలుకు తరలించినట్లు వివరించారు.నేరస్తులైన భార్యాభర్తలది మంచిర్యాల జిల్లా కాగా వీరికి ఒక కుమారుడు మరియు కూతురు ఉన్నారు.గత కొంతకాలంగా కరీంనగర్లో ఉంటూ ఈ వ్యవహారం జరుపుతున్నారు. ఈ కేసును 24 గంటలలోపు ఛేదించిన కరీంనగర్ రూరల్ సిబ్బందిని కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్ అభినందించారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కాంగ్రెస్ నాయకులు



**ధర్మఘంట జనవరి 14 మహబూబ్‌నగర్ :** ఈ నెల 17వ తేదీన మహబూబ్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయుటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవిఎస్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న బహిరంగ సభకు,అలాగే మల్లెబోయినిపల్లి సమీపంలో హెలీప్యాడ్ ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు పర్యవేక్షించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు,చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

## తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గులు నిలయం

**×మోతె మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి**




**ధర్మఘంట జనవరి 14 మోతె:** తెలుగు సంస్కృతి,సంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గులు నిలయమని మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని రాఘవపురం ఎక్స్ రోడ్ గ్రామంలో గ్రామ పంచాయితీ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో ముఖ్య అతిథిగా హాజరై,పోటిల్లో విజయం సాధించిన మహిళలకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులతో పాటు ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల లింగయ్య గౌడ్,ఉప సర్పంచ్ తాటికొండ సుజిట్ రెడ్డి,గ్రామ వార్డు సభ్యులు ముఖ్య నాయకులు,కార్యకర్తలు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జేతురం తండాలో గడప గడపకు మన సర్పంచ్...!

**శ్రీకారం చుట్టిన సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్**

**ఇంటింటికి వెళ్లి ఓట్లు అడిగినట్లే ఇంటింటికి వెళ్లి సమస్యలపై**

**ఆరాఅక్కడే అధికారులకు ఫోన్ చేసి పరిష్కారం దిశగా చర్యలు**

**వారానికి ఒక్కో తండాలో ఈ కార్యక్రమం నిర్వహణ**





**ధర్మఘంట జనవరి 14 తుర్కపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం జేతురం తండా సర్పంచ్,ఎల్ హెచ్ పీ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య సంతోష్ నాయక్ గ్రామ పంచాయితీ పరిధిలో "గడప గడపకు మన సర్పంచ్"అనే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు.ఓట్లప్పుడు ఎలాగైతే ప్రజల వద్దకు గడప గడపకు వెళ్లి ఓట్లు డుకున్నామో, అలాగే ఓట్లు వేసిన ప్రజల యొక్క సమస్యలను కూడా తెలుసుకోవడానికి గడప గడపకు వెళ్లి వాళ్ల సమస్యలు తెలుసుకుంటూ,అక్కడే అధికారులకు ఫోన్లు చేసి వాటి యొక్క పరిష్కారం దిశగా కొత్త కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. నేరుగా ఇంటి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు.వారంలో ఒక్కొక్క తండాకు ఒక్కొక్క రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.దీనితో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,వార్డు సభ్యులను,విద్యార్థులను,ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు.

ధర్మఘంట


# బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్
## కాషాయ కండువా కప్పి బండారు వేణు బృందానికి పార్టీలోకి ఆహ్వానం

**ధర్మఘంట జనవరి14 కరీంనగర్:** కేంద్రం నుండి నిధుల వరద కొనసాగాలంటే కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించాలని,కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లలో బీజేపీ కార్పోరేటర్లను గెలిపించాలని,తద్వారా కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.బుధవారం బీఆర్ఎస్ కు చెందిన 51వ, డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు వేణు,మల్లంపహడ్ మాజీ సర్పంచ్ సాధినేని మునీందర్,46వ,డివిజన్ సీనియర్ నేతలు ప్రమోద్ రావు, గాజె శివరాం,వీరితో పాటు వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి తరలివచ్చి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కరీంనగర్ అభివృద్ధికి నయాపైసా ఖర్చు చేయలేదన్నారు.కాంగ్రెస్ తో పాటు అధికారంలోకి లేని బీఆర్ఎస్ కు ఓటేయడంవల్ల అభివృద్ధి ఆగిపోయే ప్రమాదముందని తెలిపారు. అనంతరం బీజేపీలో చేరిన బండారు వేణు,సాధినేని మునీందర్,ప్రమోద్ రావు,గాజె శివరాం మాట్లాడుతూ కేంద్రం నుండి వచ్చిన నిధులవల్లే కరీంనగర్ కార్పొరేషన్ లో అభివృద్ధి జరిగిందని చెప్పారు. బండి సంజయ్ కేంద్రం నుండి పెద్ద ఎత్తున



నిధులను తీసుకురావడంవల్లే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులు,అమృత్ నిధులు సహా అనేక రూపాల్లో కేంద్రం నిధులు విడుదల చేస్తోందన్నారు.బీజేపీ సిద్ధాంతాలు,కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ చేస్తున్న కృషికి ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ,నగర మాజీ మేయర్లు సునీల్ రావు,డి.శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్,సీనియర్ నాయకులు కోమాల అంజనేయులు,వాసాల రమేశ్,బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.


# మున్సిపల్ ఎన్నికల రంగంలోకి జనసేన
## ఉమ్మడి నల్గొండ జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో పోటీ
## ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి




**ధర్మఘంట జనవరి 14 సూర్యాపేట:** రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్,మున్సిపల్ ఎన్నికల కో-ఆర్డినేటర్ మేకల సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట పట్టణంలోని రిదికా హోటల్‌లో బుధవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనసేన పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తుందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా,నిస్వార్థంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన పార్టీలో భారీగా చేరికలు జరిగాయి.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు,హుజూర్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వర రావు, మునుగోడు నియోజకవర్గ పీఓసీ శివరెడ్డి,సూర్యాపేట నియోజకవర్గ పీఓసీ శివ సాయి, మిర్యాలగూడ నియోజకవర్గ పీఓసీ కోట్రా గోవర్ధన్,తుంగతుర్తి నియోజకవర్గం పీఓసీ అశోక్, ఎస్కే.హస్సనుమియా,సైదులు, పొగుల శ్రీను,రవికిషోర్,వెంకట్, లింగస్వామి,ప్రవీణ్ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

# పేదల పాలిటి పెన్నిధి సీఎం సహాయ నిధి

**ధర్మఘంట జనవరి 14 మర్రిగూడ:** సీఎంఆర్ఎఫ్ పేదల పెన్నిదని రాంరెడ్డిపల్లి సర్పంచ్ లపంగి నర్సింహా,నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్ రావు అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ...రాంరెడ్డిపల్లికి చెందిన అయితగోని వెంకటేష్ కు రూ.60 వేలు,సిరిసాల సుమన్ కు రూ.44 వేలు,పొగాకు చిన్న సైదులుకు రూ.60వేలు,లపంగి సైదమ్మకు రూ.42 వేల చెక్కులు వచ్చాయన్నారు. నిరుపేద కటుంబాలకు ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ డబ్బులు ఎంతో ఉపయోగపడతాయని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొండ మహేందర్, భీమనగోని యాదయ్య,పగిళ్ల శంకర్,లపంగి యాదయ్య పాల్గొన్నారు.



# బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలి




**ధర్మఘంట జనవరి 14 మోత్కూరు:**ఆర్టీసీ డ్రైవర్లు తమ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సేవా దృక్పథంతో నిర్వహించాలని మోత్కూరు ఇన్స్‌పెక్టర్ సి.వెంకటేశ్వర్లు అన్నారు.రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ పరిధిలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు.హెల్మెట్లు ధరించి పట్టణ వీధుల్లో తిరుగుతూ రహదారి నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో వాహనదారులతో ఇన్స్‌పెక్టర్ ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,కారులో సీట్‌బెల్ట్ ధరించాలని,చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు.అనంతరం మోత్కూరు బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ డ్రైవర్లు,ప్రయాణికులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ల చేతుల్లో ఉంటాయని,అందుకే విధి నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా,బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని,వేగ నియంత్రణ పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందన్నారు.ఈ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ వెంకన్న,ఫైర్ సిబ్బంది జి.రవీందర్,సిహెచ్.జితేందర్, జె.అంజయ్య,ఎండి సిద్ధిక్,పోలీస్ సిబ్బంది,వాహనదారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## తెలంగాణ పల్లెల్లో అంబరాన్నంటిన
# సంక్రాంతి సంబరాలు

తెలంగాణ గ్రామాల్లో సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి.పెద్ద పండుగగా పిలుచుకునే ఈ మకరసంక్రాంతికి ప్రజల పట్టణాలను విడిచి పల్లె బాట పట్టారు.ఏ గ్రామాన్ని చూసినా,ఏ ఇంటిని చూసినా కుటుంబ సభ్యులు,బంధువులతో కళకళలాడుతున్నాయి.దీంతో గ్రామీణ ప్రాంతాలు సాంప్రదాయిక వైభవంతో వెలిగిపోతున్నాయి.
తెల్లవారుజామున మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు పరచి,చెరకు గడలు, పసుపు కుంకుమలు అలంకరించారు.గంగిరెద్దు ప్రదర్శనలు,హరిదాసు కీర్తనలు, గొబ్బిళ్లు వంటి ఆచారాలు గ్రామాలను పండుగ వాతావరణంతో నింపేస్తున్నాయి. తెలంగాణలో సంక్రాంతి నాలుగు రోజుల పాటు భోగి పండుగ,పెద్ద పండుగ,కనుమ,ముక్కనుమగా జరుపుకుంటారు.ఈ ఏడాది జనవరి 14న మకర సంక్రాంతి పండుగ ప్రారంభమైంది. గ్రామాల్లోని రైతులు పంటలు సమృద్ధిగా పండినందుకు సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలుపుతూ,కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు జరుపుకుంటున్నారు.“ఈ పండుగ మా గ్రామ జీవితానికి ప్రాణమని,పాత జ్ఞాపకాలు తలుచుకుని,కొత్త ఆశలు పంచుకుంటాం“అని నల్గొండ జిల్లాకు చెందిన ఒక రైతు తన భావాలను పంచుకున్నారు.
గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ప్రత్యేకంగా ఉంటాయి ఉదయాన్నే మగవాళ్ళు భోగి మంటలు వేసుకుని పాత చేదు జ్ఞాపకాలను మంటల్లో కాల్చినట్లు కొత్త ఆనందాలను స్వీకరిస్తారు.
మహిళలు ఇళ్లు శుభ్రం చేసి, ముగ్గులు (రంగోలీలు) వేస్తారు. చెరకు గడలు,పసుపు చెట్లు ఇంటి ముందు అలంకరిస్తారు. గంగిరెద్దు,టెంకాయలు,పూల మాలలు,పసుపు రంగులతో అలంకరిస్తారు.రంగురంగుల బట్టలతో ముస్తాబైన ఎద్దుల ఊరేగింపులు జరుగుతాయి. హరిదాసులు




ఇంటింటికీ తిరిగి భిక్షాటన చేస్తూ,భక్తి గీతాలు పాడుతారు.పిల్లలు గొబ్బిళ్లు (గొబ్బెమ్మలు) చుట్టూ ఆడుకుంటూ,పండుగ ఆనందాన్ని ఆస్వాదిస్తారు. సాంప్రదాయ వంటకాలు సంక్రాంతి పండుగకు మరింత రుచిని జోడిస్తాయి.అరిసెలు, బూరెలు,సక్కర పొంగలి,గజ్జె కాయలు వంటి ప్రత్యేక వంటలు తయారు చేస్తారు.బంధువులు, పొరుగువారు కలిసి భోజనం చేసి ఆనందాన్ని పంచుకుంటారు. కనుమ రోజున పశువులను పూజిస్తారు.ఎందుకంటే రైతుల జీవితంలో పశువులు కీలక పాత్ర పోషిస్తాయి.పశువుల ఊరేగింపులు,రంగోలీ పోటీలు, సమూహ భోజనాలు గ్రామాలను సందడిగా మారుస్తాయి.
హైదరాబాద్ వంటి నగరాల్లోనూ సంక్రాంతి ఉత్సవాలు జరుగుతున్నాయి.పరేడ్ గ్రౌండ్స్‌లో ఇంటర్నేషనల్ కైట్


గంట సోమన్న,
సీనియర్ జర్నలిస్ట్.

అండ్ స్వీట్ ఫెస్టివల్ జరుగుతోంది.కానీ,గ్రామాల్లోని సంబరాలు మాత్రం సహజ సిద్ధమైనవి,పల్లెల్లో నిర్వహించే సంక్రాంతి ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆనందాన్ని ఇచ్చే ఆటలు,ప్రత్యేకంగా మహిళలు పాల్గొని ఆటలు సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తాయి.ఈ పండుగ గ్రామీణ జీవితం, వ్యవసాయ సమృద్ధి,సమూహ ఆనందాన్ని గుర్తుచేస్తుంది. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో హాయిగా గడపాలని, సాంప్రదాయాలను కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.ఈ సంవత్సరం కూడా తెలంగాణ పల్లెలు సంక్రాంతి వెలుగులతో మెరిసిపోతున్నాయి.

# మోత్కూరు కంఠమహేశ్వర స్వామికి భోగి బోనాలు
### అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన మహిళలు





**ధర్మఘంట జనవరి 14 మోత్కూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలో బుధవారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని గౌడ కులస్తులు కంఠమహేశ్వర స్వామికి బోనాలు సమర్పించారు.మోత్కూర్ మున్సిపాలిటీలోని బిక్కేరు వాగు ఒడ్డున కొలువుదీరిన కంఠమహేశ్వర స్వామి ఆలయానికి,అలాగే ధర్మపురం రోడ్డులో ఉన్న కంఠమహేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అనుసరిస్తూ భక్తులు బోనాలతో కాలినడకన బయలుదేరి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రతి ఏటా సంక్రాంతి భోగి రోజున కంఠమహేశ్వర స్వామికి గౌడ కులస్తులు బోనాలు సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని భక్తులు తెలిపారు.ఈ వేడుకలతో ఆలయ ప్రాంగణాలు భక్తుల కోలాహలంతో సందడిగా మారాయి.ఈ కార్యక్రమంలో బుర్ర కృష్ణ,బత్తిని శ్రీనివాస్,లోడే యాదయ్య,సుదగాని కృష్ణయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్,గొడిశాల రవి, బుర్ర రమేష్,భైరు యాకస్వామి, బుర్ర రామస్వామి,బుర్ర సోమన్న, గనగాని చంద్రయ్య, బుర్ర లచ్చయ్య,బుర్ర అయిలయ్య, బుర్ర నర్సయ్య,బీసు భాస్కర్, బుర్ర వెంకన్న,గనగాని రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**17వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలి**

**23, 24 తేదీల్లో హైదరాబాదులో శిక్షణ**

**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పిలుపు**



**మొద్గులపల్లి** ఈనెల 23,24వ తేదీల్లో హైదరాబాదులోని నాంపల్లి లో ఉన్న మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరగనున్న జర్నలిస్టుల శిక్షణా తరగతులను జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని టి యు డబ్ల్యూజె ( ఐజేయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి కోరారు. శిక్షణ తరగతులను దృష్టిలో ఉంచుకొని బుధవారం నాడు జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించిన అనంతరం చిట్యాల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. తెలంగాణ మీడియా అకాడమీ,టీయూడబ్ల్యూజే(ఐజేయు ) ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు సంబంధించి ఆసక్తి ఉన్న జర్నలిస్టులు ఈనెల 17వ తేదీలోగా టి యు డబ్ల్యూ జె జిల్లా కమిటీకి తమ పేర్లను అందజేయాలని తెలిపారు. జర్నలిజంలో వృత్తిపరంగా ఎంతో నైపుణ్యం కోసం అందజేస్తున్న ఈ శిక్షణ జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తూనే, వృత్తిపరంగా మెలకువలు నేర్పించడం కోసం శిక్షణ తరగతులు ఏర్పాటుచేసిన మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ తో పాటు ఇంటి స్థలం, ఇల్లు, హెల్త్ కార్డులు అందించడం కోసం టియుడబ్ల్యూజే జిల్లా కమిటీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు దోటి శ్రీనివాస్ఖఔజీ ×జీఖ జిల్లా నాయకులు పులిమామిడి మహేందర్ రెడ్డి, చిట్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యే ళ్ల బయన్న, మెండె వెంకన్న, పోకల కరుణాకర్, చెరుపల్లి శ్రీనివాస్, మిరియాల ప్రకాష్, అమ రోజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ప్రతీక ముగ్గుల పోటీలు



**మాడుగులపల్లి, :** సంక్రాతి పండుగను పురస్కరించుకొని, మండలంలోని కల్వల పాలెం గ్రామంలో, మహిళకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో, సంసృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ముగ్గుల ను వేసి, చక్కటి ప్రతిభ కనబర్చిన మహిళలకు,సర్పంచ్ చిట్యాల సునీత దానియేలు చేతుల మీదుగా,ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద నగదు పరితోషకాన్ని, పోటీలలో పాల్గొన్న మహిళ లందరికి పార్టీసీపేషన్ బహుమతులను అందచేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు చింత కాయల సోమయ్య, తిరుగుడు సోమయ్య, చింత కాయల సతీష్, చింత కాయల సురేష్, చిట్యాల సుమంత్, చిట్యాల యల్లయ్య,కేసాని జనార్దన్ రావు,వార్డు మెంబెర్ సీతక్క, సైదమ్మ చింత కాయల నాగరాజు తదితరులున్నారు.

## ఘనంగా గోదా రంగనాథ స్వాముల కళ్యాణం



**సూర్యాపేట:** ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ రంగనాథ స్వాముల కల్యాణాన్ని ఆకాశమంత పందిరి వేసి శాస్త్రక్తంగా దేవాలయ అర్చకులు వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని ఉత్తర బాగాన ఉన్నా ఖాళీ స్థలములో ప్రత్యేకమైన మండపాన్ని ఏర్పాటు చేసి శ్రీ రంగనాథ స్వాముల కళ్యాణాన్ని నిర్వహించారు. సుమారు 1200 మంది దంపతులు ఒకే రకం వస్త్రధారణలో కళ్యాణంలో కూర్చొని ఆసాంతం తిలకించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ దంపతులు,ఏ ఐసి సి నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఈ కళ్యాణ వేడుకల్లో పాల్గొని ఆశాంతం తిలకించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కళ్యాణము మధ్యాహ్నం 12 గంటలకు జీలకర్ర బెల్లం మాంగళ్య దారుణతో కళ్యాణ తంతు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతు బజార్ నుండి కోర్టు చౌరస్తా వరకు రహదారి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుంచి ప్రపంచ స్థాయికి క్రీడాకారులే లక్ష్యం కలెక్టర్ చంద్రశేఖర్




**నల్గొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ ద్వారా గ్రామస్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు క్రీడా ప్రతిభను వెలికి తీసే అవకాశాలు కలుగుతున్నాయని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం నల్గొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో సీఎం కప్ టార్చ్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి సీఎం కప్ పోటీలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడాకారులను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన లక్ష్యమన్నారు.క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వం, జట్టు భావన పెరుగుతాయని పేర్కొన్న కలెక్టర్, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ సీఎం కప్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విజయంపరాజయం కంటే పాల్గొనడమే ముఖ్యమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, ఎస్బీఐ మల్లారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్, ప్రతీక్ రెడ్డి కాలేజ్ సీఈవో గోనా రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి మీర్ అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి సందర్భంగా నేరేడుచర్లలో రక్తదాన శిబిరం



**నేరేడుచర్ల :** స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని పాత నేరేడుచర్ల యూత్ ఆధ్వర్యంలో బుధవారం నాలుగవ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 42 మంది రక్తదాతలు తలసేమియా బాధిత పిల్లల కోసం రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు. శిబిరాన్ని ఆర్గనైజర్ దేవిరెడ్డి నాగిరెడ్డి ప్రారంభించి, రక్తదాతలు, సహకారులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి న్యాయవాది గూడూరు శ్రీనివాస్, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, కొణతం నాగిరెడ్డి, యారవ సురేష్ తదితరులు హాజరై రక్తదాతలను అభినందించారు.ఈ కార్యక్రమం ద్వారా సమాజ సేవలో యువత పాత్ర కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు.


## సీఎం కప్2025 క్రీడా పోటీలు ప్రారంభం గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి అవకాశం



**సూర్యాపేట :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 2వ ఎడిషన్ సీఎం కప్2025 క్రీడా టోర్నమెంట్‌లో భాగంగా జిల్లాలో గ్రామ, మండల, నియోజకవర్గం మరియు జిల్లా స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ టోర్నమెంట్‌లో ఉపజూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలతో పాటు దివ్యాంగ క్రీడాకారుల విభాగంలోనూ పోటీలు జరుగుతాయి. గ్రామ స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా తదితర క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు మండల స్థాయికి వెళ్లే అవకాశం పొందుతారు. మండల, మున్సిపాలిటీ స్థాయిల్లోనూ ఇదే విధంగా పోటీలు నిర్వహించి ఉత్తమ క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి పంపుతారు.నియోజకవర్గం మరియు జిల్లా స్థాయిల్లో మరిన్ని క్రీడల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. సీఎం కప్2025లో పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసి వారికి రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించడమే ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా అన్ని మున్సిపాలిటీల్లో జనసేన పోటీ

**ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి**




**సూర్యాపేట:** రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్,మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్ మేకల సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట పట్టణంలోని రిదికా హోటల్‌లో బుధవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనసేన పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తుందన్నారు.పార్టీని మరిం త బలోపేతం చేయడానికి నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా, నిస్వార్థంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన పార్టీలో భారీగా చేరికలు జరిగాయి.ఈ కార్యక్ర మంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు,హుజూర్నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వర రావు, మునుగోడు నియోజకవర్గం పీఓసీ శివ రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గం పీఓసీ శివ సాయి, మిర్యాలగూడ నియోజకవర్గం పీఓసీ కోట్రా గోవర్ధన్, తుంగతుర్తి నియోజకవర్గం పీఓసీ అశోక్ నాయకులు ఎస్.కే. హస్సనుమియా, సైదులు, పొగుల శ్రీను, రవికిషోర్, వెంకట్,లింగ స్వామి, ప్రవీణ్ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## పేద వృద్ధులకు రగ్గుల పంపిణి



**మఠంపల్లి :** సూర్యాపేట జిల్లామండల కేంద్రమైన మఠంపల్లి కి చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస రచయిత, మైండ్ పవర్ లో ప్రపంచ రికార్డు గ్రహీత తాటికొండ వేణుగోపాల్ రెడ్డి తన తల్లి తండ్రులైన తాటికొండ వెంకట్ రెడ్డి, పిచ్చమ్మల జ్ఞాపకార్థం తన స్వగ్రామమైన మఠంపల్లి లోని నిరుపేదలైన వంద మంది వృద్ధులకు రగ్గులను పంపిణి చేశారు.ఈకార్యక్రమంలో కుటుంబసభ్యులు తాటికొండ పాపిరెడ్డి,కల్పన,జానకమ్మ, పద్మ పాల్గొన్నారు.

## డాక్టర్. ఏ.ఎస్.రావు పరీక్షల్లో జయ విద్యార్థుల ప్రభంజనం




**సూర్యాపేట:** ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఏ. ఎస్.రావు 35 వ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష యందు జయ ఒలంపియాడ్ స్కూలు విద్యార్థులు 9, 10వ తరగతి కేటగిరీలలో మొదటి ర్యాంకు సాధించడంతో పాటు మొత్తం 14 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. డిసెంబర్ 2025, 28న నిర్వహించిన ఈ పరీక్షల్లో పదవ తరగతి నుండి వి వైష్ణవి 100% సాధించి రెండు తెలుగు రాష్ట్రాల నుండి మొదటి ర్యాంకు, 9వ తరగతి లో100% మొదటి ర్యాంకు సాధించారు. 9 వ తరగతిలో 21 ర్యాంకులు ప్రకటించగా అందులో 6 గురు జయ స్కూల్ విద్యార్థులు 10వ తరగతిలో 20 ర్యాంకుల ప్రకటించగా 8 మంది జయ స్కూల్ విద్యార్థులు సాధించడం జరిగింది. 9వ తరగతి నుండి వై .వీక్షణ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, వి. జయసూర్య స్టేట్ 9వ ర్యాంక్, బొల్లం సాయి చరణ్ స్టేట్ 12వ ర్యాంక్, పి వైశాలి స్టేట్ 12వ ర్యాంక్, ఏ .లిఖిత రేణు స్టేట్ 17 ర్యాంక్, వి గౌతమ్ స్టేట్ 19వ ర్యాంక్ సాధించగా పదవ తరగతి నుండి వి.వైష్ణవి స్టేట్ ఒకటవ ర్యాంక్ డి.రిత్విక స్టేట్ ఆరో ర్యాంక్, ఆర్. రొమ్యానంద్ స్టేట్ 10 ర్యాంక్, కే. దేవి ప్రియ స్టేట్ 12వ ర్యాంక్, సిహెచ్.నంద వర్ధన్ రెడ్డి స్టేట్ 14 వ ర్యాంక్, డి శ్రీహర్ష స్టేట్ 15 ర్యాంక్, బి. ప్రసన్న స్టేట్ 17వ ర్యాంక్, ఎం.ఆరాధ్య స్టేట్ 17వ ర్యాంకు సాధించారు. మొత్తం 41 ర్యాంకులలో 14 మంది జయ ఒలంపియాడ్ విద్యార్థులు ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ లు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి సహకరించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



సూర్యాపేట పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల నడుమ ఘనంగా జరిగాయి వారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ కి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు కాంగ్రెస్ పార్టీకి ప్రజలకు ఎనలేని సేవలు చేసినరాని టేకుమట్ల గ్రామానికి నూతన సర్పంచ్ గా ఎన్నికై గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గట్టు శ్రీనివాస్ దంపతులు ఆయురారోగ్యాలతో ఉండాలని వారికి వారి కుటుంబ సభ్యులకు సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల మధు గౌడ్, యాట వెంకన్న, ప్రభాకర్, ఫారూఖ్, శ్రీనివాస్, నారెడ్ల సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## జీవన జ్యోతి స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో వంట సరుకులు పంపిణి



**మఠంపల్లి :** మండల కేంద్రమైన మఠంపల్లి కి చెందిన జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థవారు గ్రామానికి చెందిన వందమందికి బియ్యం, పంచదార, కందిపప్పు,ఉల్లిగడ్డలు,వంట నూనెలు అందించడం జరిగిందని డైరక్టర్ అల్లం జార్జిరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ అల్లంవిల్ ఫ్రెడ్,కోశాధికారి బోయపాటి రాణి పాల్గొనగా సహకరించిన వారికి ధన్యవాదములు తెలిపారు.